తెలంగాణ స్వరాష్ట్ర సుపరిపాలన పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
గురువారం
10 సెప్టెంబర్ 2026

మన అంగన్వాడి - మన బాధ్యత

తొమ్మిదవ జాతీయ పోషణ మాసం పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):
మహిళా శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాట్లాడుతూ.. మనం అంగన్వాడి –మన బాధ్యత అని,సెప్టెంబరు 9 నుంచి అక్టోబర్ 8 వరకు పోషణ మాసంలో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మాతా, శిశు సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వాలు పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిశీలనకు 'పోషణ్ అభియాన్'ను నిర్వహిస్తున్నామన్నారు. వారు తీసుకోవాల్సిన ఆహారంపై సూచనలివ్వడం, చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. అనంతరం 9వ జాతీయ పోషణ మాసం పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, డీఈఓ రాజు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

12న సంగారెడ్డి జిల్లాలో జాతీయ లోక్‌అదాలత్

సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): ఈ సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 3వ జాతీయ లోక్‌అదాలత్‌ను సెప్టెంబర్ 12న జిల్లా కోర్టుతో పాటు జహీరాబాద్, జోగిపేట, నారాయణఖేడ్, జిన్నారం కోర్టు ప్రాంగణాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డీఎల్ఎస్ఏ చైర్‌పర్సన్ జి.భవానీ చంద్ర తెలిపారు.
లోక్‌అదాలత్‌లో సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, మోటార్ వాహన ప్రమాద పరిహారం, కుటుంబ, బ్యాంకింగ్ తదితర రాజీ పడదగిన కేసులను ఇరు పక్షాల పరస్పర అంగీకారంతో త్వరగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. పెండింగ్ కేసులతో పాటు ప్రీ-లిటిగేషన్ దశలో ఉన్న వివాదాలను కూడా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. లోక్‌అదాలత్ ద్వారా సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరుపక్షాల మధ్య సుహృద్భావ వాతావరణం ఏర్పడుతుందని, కోర్టుల్లో పెండింగ్ కేసుల సంఖ్య తగ్గుతుందని పేర్కొన్నారు. అత్యధిక కేసుల పరిష్కారానికి న్యాయాధికారులు, న్యాయవాదులు, పోలీసులు, సంబంధిత శాఖల అధికారులు సహకరించాలని కోరారు. ప్రజలు సంబంధిత కోర్టు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లేదా తాలూకా న్యాయ సేవా కమిటీని సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.
"రాజీ మార్గమే ఉత్తమ మార్గం-లోక్‌అదాలత్ ద్వారా త్వరితగతిన న్యాయం" లక్ష్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భవానీ చంద్ర కోరారు.

సెంట్రల్ మెడిసిన్ స్టోర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):
జోగులాంబ గద్వాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ మెడిసిన్ స్టోర్‌ను డీఎంహెచ్‌ఓ సంధ్యా కిరణ్మయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ రకాల మందుల నిల్వలు, భౌతిక స్థితి, స్టాక్ రిజిస్టర్లు, ఇండెంట్ రిజిస్టర్లు, పంపిణీ రికార్డులను పరిశీలించారు. రికార్డుల్లో నమోదైన వివరాలు, స్టోర్‌లోని భౌతిక నిల్వలతో సరిపోలుతున్నాయా లేదా అనే అంశాన్ని తనిఖీ చేశారు.
మందుల నిల్వలు, వినియోగం, పంపిణీ వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఇతర ఆరోగ్య సంస్థలకు అవసరానికి అనుగుణంగా నిర్ణీత విధానం లో మందులు సకాలంలో సరఫరా అయ్యేలా చూడాలని ఆదేశించారు. మందుల కొరత రాకుండా ముందస్తు ప్రణాళికతో ఇండెంట్లు సిద్ధం చేసుకోవాలని, అత్యవసర మందుల లభ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.
అలాగే మందుల కాలపరిమితి, బ్యాచ్ నంబర్లు, నిల్వ విధానం, పరిశుభ్రత, భద్రత ప్రమాణాలను పరిశీలించారు. కాలపరిమితి సమీపిస్తున్న మందులను గుర్తించి నిబంధనల ప్రకారం వినియోగం, పంపిణీపై శ్రద్ధ వహించాలని తెలిపారు. మందుల నిల్వ, పంపిణీలో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతగా విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సకాలంలో మందులు అందుబాటులో ఉంటే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని పేర్కొన్నారు. తనిఖీలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసూనరాణి, జిల్లా వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ నరేందర్ బాబు పాల్గొన్నారు.

మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను ఆవిష్కరణ

• **జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక**

నారాయణపేట జిల్లా బ్యూరో సెప్టెంబర్9 (జనంసాక్షి):
వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు, రసాయనాల వినియోగం వల్ల జల వనరులు కాలుష్యానికి గురవుచున్నాయని, అందుచే కృత్రిమ రంగులు, రసాయనాలతో చేసిన విగ్రహాలను మానివేసి మట్టితో చేసిన విగ్రహాలను పూజించి చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు.బుధవారం జిల్లా కలెక్టర్ విసీ హాల్ లో వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఈ సంవత్సరం, పర్యావరణం పై అవగాహన కల్పించేందుకు, మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను ఎస్పీ వినీత్ తో కలిసి ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోని పర్యావరణాని కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు.
రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలలో భాగంగా 8 అంగుళాల మట్టి గణపతి లను అందించి పర్యావరణంపై అహగహన కార్యక్రమాలను తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వారిచే నిర్వహంచడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.
చెరువుల్లో మట్టి మేటలను తొలిగించటానికి చెరువులో స్వచ్ఛత కాపాడటానికి వినాయక చవితి సందర్భంగా ప్రజలు భక్తులు నదుము బిగించాలని మట్టి తో వినాయక విగ్రహాలు తాయారు చేసి భక్తితో చెరువులోకి చేర్చొచ్చని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు.
మట్టి విగ్రహాలను పూజించి చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్మన్ మంజుల, ఈ.డి.ఎస్.సి.కార్పొరేషన్ అబ్దుల్ ఖలీల్,డీఎస్పీలు తదితరులు నల్లపు లింగయ్య , మహేశ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను మరువద్దు: ఎంపీ డీకే అరుణ

• **ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం**

మక్తల్, సెప్టెంబర్ 09 (జనంసాక్షి):
ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను ఏమాత్రం విస్మరించకూడదని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ పిలుపునిచ్చారు. మక్తల్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ, నేటి సమాజంలో ఇంగ్లీష్‌లో మాట్లాడితేనే గొప్ప అనే భావన పెరిగిపోవడం సరికాదన్నారు. అవసరాలకు అనుగుణంగా ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చని, అయితే మాతృభాషకు ఇవ్వాల్సిన గౌరవం ఎప్పటికీ తగ్గకూడదని స్పష్టం చేశారు. పరాయి భాషల్లో వ్యవహారాలు నడిపినా, ఇంట్లో కుటుంబ సభ్యులతో మాత్రం స్వచ్ఛమైన తెలుగులోనే మాట్లాడాలని సూచించారు. అమ్మ అనే పదంలో ఉన్న మాధుర్యం, అనుబంధం మరే ఇతర భాషల్లో లభించవని గుర్తుచేశారు. విద్యార్థులు కష్టపడి ఉన్నత చదువులు చదవాలని, పేదరికాన్ని జయించి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని ఆమె ఆకాంక్షించారు. చదువుతో పాటు పెద్దలను, తల్లిదండ్రులను గౌరవించే సంస్కారాన్ని అలవర్చుకోవాలని హితవు పలికారు. మక్తల్ జెడ్పీ ఉన్నత పాఠశాల కేంద్ర ప్రభుత్వ 'పీఎం శ్రీ' పథకంతో పాటు తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా ఎంపిక కావడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ నిధులతో పాఠశాలలో డిజిటల్ లైబ్రరీ, అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్, ఇతర మౌలిక వసతులను త్వరలోనే పూర్తిస్థాయిలో సమకూరుస్తామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగ్ పాండురెడ్డి, జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్, సీనియర్ నాయకులు బలరాం రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, లక్ష్మీ శ్యామ్ సుందర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

సంగారెడ్డి నియోజకవర్గ నూతన కమిటీల నియామకం

సంగారెడ్డి, సెప్టెంబర్ 09(జనంసాక్షి):
సంగారెడ్డి నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీలు, నాలుగు మండలాల కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీల నియామక సమావేశం డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొని కమిటీలను నియమించారు.
పార్టీ కోసం సైనికుల్లా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నూతన కమిటీ సభ్యులకు సూచించారు. ఎవరూ నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, పార్టీలో అందరికీ ప్రాధాన్యం ఉంటుందని అన్నారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 5 వరకు కార్యకర్తల సమావేశాలు నిర్వహించి, మండలాల వారీగా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అనంతకిషన్, జూలకంటి ఆంజనేయులు, రామ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాకవి కాళోజీ జీవితం నేటి తరానికి ఆదర్శనీయం: జిల్లా కలెక్టర్ ప్రియాంక

నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్9 (జనంసాక్షి): ప్రజాకవి కాళోజీ నారాయణరావు తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని, ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు. కాళోజీ నారాయణ రావు జయంతిని పురస్కరించుకుని బుధవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్ లో ఏర్పాటు చేసిన కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలకు జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరై కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు, సామాజిక అంశాలను తన రచనల ద్వారా ప్రజల ముందుకు తీసుకువచ్చి వారిలో చైతన్య స్ఫూర్తిని నింపిన మహనీయుడు కాళోజీ అని అన్నారు. తెలంగాణ భాష, సంస్కృతి పరిరక్షణకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కాళోజీ సాహిత్యం ప్రజల్లో చైతన్యం నింపిందని, ఆయన రచనలు, ఆలోచనా విధానాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాళోజీ ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్ పర్సన్ మంజుల, డీ డబ్ల్యు ఓ రాజేందర్ గౌడ్, బీసీ సంక్షేమ

శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, కలెక్టరేట్ ఏ వో అనిల్ కుమార్, డీ పీ ఆర్ వో రషీద్, మున్సిపల్ కమిషనర్ శంకర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపసర్పంచుల చెక్ పవర్ రద్దు చేయాలి

- **తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ పిలుపుమేరకు కలెక్టరేట్ ముందు ధర్నా**
- **సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి**

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):

తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ పిలుపు మేరకు బుధవారం నాగర్‌కర్నూలు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు వార్ల వెంకటయ్య ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జిల్లా నలుమూలల నుండి వచ్చినటువంటి దాదాపు 100 మంది సర్పంచులు ధర్నా నిర్వహించి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీ దేవసహాయంకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ప్రధానంగా గ్రామాల్లో సర్పంచులు అధికారంలోకి వచ్చి 8నెలలు కావస్తున్నా 2018 చట్టం ప్రకారం ఉపసర్పంచులకు ఉన్న జాయింట్ చెక్ పవర్ వల్ల గ్రామాల అభివృద్ధికి ఆటంకంగా మారింది. సర్పంచులు చేసే చిన్న చిన్న పనులకు కూడా వాటర్ సప్లై, డ్రైనేజ్, స్ట్రీట్ లైట్స్ వంటి వాటికి కూడా ఉపసర్పంచుల సంతకం చేయకపోవడంతో సర్పంచులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఉప సర్పంచ్‌ల జాయింట్ చెక్ పవర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రామ మొదటి పౌరుడులైన సర్పంచ్ కు ఓటు హక్కు కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం సర్పంచులకు ఇస్తున్న 6500 గౌరవ వేతనాన్ని కనీసం 25,000 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అదేవిధంగా స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నుండి రావాల్సిన నిధులను వెంటనే గ్రామ పంచాయతీ ఖాతాలకు విడుదల చేయాలని, మరియు ఈ మధ్యనే రిలీజ్ అయిన నిధులను గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమచేయాలని వినతిపత్రం అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు వార్ల వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి రామ్ భీష్మ సర్పంచులు సుప్రియ, రాజు, శ్రీను, శ్యామ్, సంద మల్లేష్, సైదులు, రమేష్, పద్మ, పుష్ప, శ్రీలత, లక్ష్మమ్మ, అంజమ్మ, బాల వెంకటయ్య, చిన్న రాములు, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు భావవ్యక్తీకరణ
నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- **సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే.దీప**

వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):

విద్యార్థులు చిన్ననాటి నుంచే భావవ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు, ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాని సాధన కోసం నిరంతరం కృషిచేయాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే. దీప సూచించారు.బుధవారం వనపర్తి పట్టణంలోని చాణుక్య పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన పాఠశాల రేడియో స్టేషన్ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే.దీప పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు విభిన్నమైన, సులభమైన పద్ధతులను అనుసరించడం ద్వారా వారు చట్టపరమైన అంశాలను త్వరగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థి దశలోనే జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకొని, ఆ లక్ష్య సాధనకు క్రమశిక్షణతో నిరంతరం కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలు, సందేహాలకు ఆమె సమాధానాలు ఇచ్చారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుర్వినియోగం, బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం (పోక్సో) తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చట్టాలపై ప్రతి విద్యార్థి ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ వర్ధంతిని విజయవంతం చేద్దాం

ఖిల్లా ఘనపూర్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):

సెప్టెంబర్ 10న తెలంగాణ వీరనారి చాకలి చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమాలను అన్ని మండలాలు, గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని రజక సంఘం జిల్లా నాయకులు విజయ్ పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచారని అన్నారు. భూమి, గౌరవం, హక్కుల కోసం భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. మహిళలు కూడా అన్యాయానికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడగలరని ఐలమ్మ నిరూపించారని పేర్కొన్నారు. ఆమె ఆశయాలు, పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. వర్ధంతి కార్యక్రమాల్లో రజకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

13న కబడ్డీ ఎంపిక పోటీలు

ఉర్కొండ, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాల, బాలికలు, సబ్‌జూనియర్ బాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈనెల 13న నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాదయ్య తెలిపారు. ఉర్కొండ మండల కేంద్రంలోని క్రీడా మైదానంలో ఉదయం 8 గంటలకు ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 26నుంచి 29వరకు వేములవాడలో జరిగే అంతర్‌జిల్లా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. బాలురు 75 కిలోల్లోపు, బాలికలు 55 కిలోల్లోపు ఉండాలని సూచించారు. ఆధార్ కార్డు, పదో తరగతి మెమోతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 8978358922, 9951629694 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

విద్యుత్ కోతను నిరసిస్తూ రైతుల రాస్తారోకో

జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):

విద్యుత్ కోతలను నిరసిస్తూ జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లిలో బీఆర్ ఎస్ ఆధ్వర్యంలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. వందలాది మంది రైతులు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినా దాలు చేశారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోతున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జంబుల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అప్రకటిత విద్యుత్ కోతలతో వ్యవసాయ రంగానికి నష్టం జరుగుతోందని ఆరోపించారు. రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గంటపాటు రాస్తారోకో తో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు అధికారులతో మాట్లాడి రైతుల ఆందోళనను విరమింప జేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై
బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

ఖిల్లా ఘనపూర్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే విర్లపల్లి శంకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు ఘనపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వెంకటేష్‌కు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే వ్యాఖ్యలు తీవ్రంగా ఖండనీయమని అన్నారు. శంకర్ వెంటనే కేసీఆర్‌కు ఎలాంటి షరతులు లేకుండా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసనలు చేపట్టి, ఆయనను పదవి నుంచి తొలగించే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్ విడుదల

మల్దకల్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):

మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు తహసిల్దార్ ఝాన్సీరాణి,ఎంపీడీవో ఆంజనేయరెడ్డి,చలో హైదరాబాద్ గోడపత్రికను బుధవారం విడుదల చేశారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఈజీఈజేఏసీ కన్వీనర్ తెలంగాణ టీచర్స్ యూనియన్ అధ్యక్షులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మంది ఉద్యోగులకు గత మూడు సంవత్సరాల నుంచి 6 డీఏలు,మూడు సంవత్సరాలైనా రెండో పి ఆర్ సిని అమలు చేయకపోవడం, 268 వేలకు పైగా ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేయకపోవడం,హెల్త్ కార్డులను సమర్థవంతంగా నిర్వహించకపోవడం, బకాయి పడ్డ పదివేల కోట్ల రూపాయలు ఉద్యోగులకు చెల్లించకపోవడం తెలంగాణలోని ఉద్యోగులకు ఆర్థిక భరోసాను బలహీనపరుస్తుందని వ్యాఖ్యానించడం జరిగింది, ఈ హక్కుల సాధనకై సెప్టెంబర్ 10వ తారీఖున చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని,ప్రతి ఉద్యోగి తమ బాధ్యతగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు క్రాంతి కుమార్,భాస్కర్ గౌడ్, రాజశేఖర్ రెడ్డి, దస్తగిరి,మండల విద్యాధికారి సురేష్,పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడు నరేష్,పంచాయతీ కార్యదర్శులు,భాస్కర్, నాయక్,బసిరెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ దళిత వ్యతిరేకులు

• ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి

నంగునూర్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లు దళిత వ్యతిరేక వైఖరిని మరోసారి బయటపెట్టుకున్నారని టీపీసీసీ కార్యదర్శి, నంగునూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించారని ఆరోపించారు. నేరెళ్ల ఘటనలో దళితులపై థర్డ్‌డిగ్రీ ప్రయోగించిన విషయాన్ని గుర్తుచేశారు. తాటికొండ రాజయ్య, కడియం శ్రీహరి, కొప్పుల ఈశ్వర్, జోగు రామన్న వంటి దళిత నేతలను అవమానించారని ఆరోపించారు.

అసెంబ్లీ ప్రాంగణంలో దళిత స్పీకర్‌ను అవమానించేలా వ్యవహరించారని యాదగిరి మండిపడ్డారు. దళితులు నిరసన తెలిపిన ప్రాంతంలో పసుపు నీళ్లు చల్లడం ద్వారా దొర అహంకారాన్ని ప్రదర్శించారని విమర్శించారు. దళితుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

గద్వాల శివారులో

ఇంటి స్థల పట్టా ధ్రువపత్రాల పరిశీలన

• ఈ నెల 18లోగా అసలు పత్రాలు సమర్పించాలి

గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గద్వాల మండలం, గ్రామ శివారులోని సర్వే నంబర్లు 968, 969, 979, 980, 983, 984, 985లో ప్రభుత్వం సేకరించిన భూముల్లో 2013లో ఇంటి స్థల పట్టాలు పొందిన లబ్ధిదారులు తమ అసలు పట్టా ధ్రువపత్రాలు, సంబంధిత పత్రాలను సెప్టెంబర్ 18లోగా తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని తహసీల్దార్ హరికృష్ణ సూచించారు.

ఈ భూముల్లో ప్రభుత్వం 350 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్న నేపథ్యంలో కొందరు లబ్ధిదారులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి రిట్ పిటిషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు పట్టా ధ్రువపత్రాలను ప్రభుత్వ రికార్డులతో సరిపోల్చి వాటి నిజానిజాలు నిర్ధారించి నివేదిక సమర్పించాల్సి ఉందన్నారు.

మొత్తం 558 మంది దరఖాస్తుదారుల్లో ఇప్పటికే 375 మంది పత్రాలు సమర్పించగా, మిగిలిన 183 మంది సెప్టెంబర్ 18లోగా అసలు పట్టా ధ్రువపత్రాలతో పాటు ఇతర సంబంధిత పత్రాలు సమర్పించాలని కోరారు. గడువులోగా పత్రాలు సమర్పించకపోతే కార్యాలయంలోని ప్రభుత్వ రికార్డుల ఆధారంగా తదుపరి చర్యల కోసం కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని హరికృష్ణ స్పష్టం చేశారు.

పెండింగ్ నోటీసులను గడువులోగా పరిష్కరించాలి

• అదనపు కలెక్టర్ (రెవెన్యూ) హరిప్రియ

జడ్చర్ల, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా జారీ చేసిన పెండింగ్ నోటీసులను నిర్ణీత గడువులోగా సక్రమంగా సర్వ్ చేయడంతో పాటు త్వరితగతిన పరిష్కరించాలని 75-జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ అధికారులను ఆదేశించారు. బుధవారం జడ్చర్ల తహశీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మార్గదర్శకాల ప్రకారం సవరించిన షెడ్యూల్‌ను వివరించి, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ అక్టోబర్ 7 వరకు, అలాగే నోటీసుల పరిష్కార ప్రక్రియ నవంబర్ 5 వరకు కొనసాగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితాను నవంబర్ 9, 2026న ప్రచురించనున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 12 మరియు 13 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించే రెండవ విడత ప్రత్యేక ప్రచార దినాలను ఓటర్లు వినియోగించుకోవాలని కోరారు. కొత్తగా ఓటరుగా నమోదు కోసం ఫారం-6, పేర్ల తొలగింపు కోసం ఫారం-7, వివరాల సవరణల కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో జడ్చర్ల తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ తహసీల్దార్, ఎన్నికల డీటీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి

నుంచే క్రీడలకు ప్రాధాన్యం

మునిపల్లి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): మునిపల్లి మండలం లింగంపల్లి గురుకుల పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీలను ఏఎంసీ చైర్మన్ మంతూర్ సుధాకర్‌రెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. మండలస్థాయి పోటీల ద్వారా ప్రతిభావంతులను గుర్తించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి సిద్ధం చేయవచ్చన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులను ఖండించిన సర్పంచులు

కొల్చారం, సెప్టెంబర్ 09(జనంసాక్షి); పాత పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్న టీఆర్ఎస్ పార్టీ తాజా మాజీ సర్పంచులు, కారుణ్య నియామకాలు చేపట్టాలని పోరాడుతున్న వీఆర్ఏలు, జీతాలు పెంచాలని కోరుతున్న అంగన్వాడీలను బుధవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ అరెస్టులను కొల్చారం మండల సర్పంచుల పురం అధ్యక్షు యాబన్న గారి రవితేజ రెడ్డి,ప్రధాన కార్యదర్శి దొడ్ల ఆంజనేయులు ఖండించారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించి, వీఆర్ఏల కారుణ్య నియామకాలు చేపట్టి, అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు మోహన్, వినోద్ నాయక్, బి ఆర్ ఎస్ నాయకులు అరిగే విజయ్‌కుమార్, రమేష్, పుర్రె ప్రభాకర్, సందీప్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు: జిల్లా అధికారి డా.భాస్కర్ నాయక్

వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. భాస్కర్ నాయక్ ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. జిల్లా కార్యక్రమ అధికారులు డా. వంశీకృష్ణ, డా.మారుతి నందన్, డా.మంజుల పాల్గొన్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రతి జ్వర కేసుకు రక్త పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన కేసుల నమూనాలను తదుపరి నిర్ధారణ కోసం ఎలీసా పరీక్షలకు టీ-హబ్‌కు పంపాలని ఆదేశించారు. పాజిటివ్ కేసుల ఇళ్లను వైద్య సిబ్బంది సందర్శించి కుటుంబ సభ్యులందరికీ రక్త పరీక్షలు నిర్వహించాలని, బాధితుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

అసాంక్రమిక వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా గుర్తింపు పరీక్షలను విస్తృతం చేయడంతో పాటు చికిత్స పొందుతున్న వారి సంఖ్య పెంచాలని, పెండింగ్ ఆరోగ్య పరీక్షలను పూర్తి చేయాలని ఆదేశించారు. మాతా, శిశు సంరక్షణలో వంద శాతం గర్భిణీల నమోదు పూర్తిచేసి, సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. గర్భిణీలను ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. టీకాలు వేసిన వివరాలను అదే రోజు యూ-విన్ పోర్టల్‌లో నమోదు చేయాలని, కుక్క, కోతి, ఎలుక, ఇతర జంతువుల కాట్లు, పాము కాట్ల వివరాలను ఐహెచ్ఐపీ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. సమావేశంలో వైద్యాధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు

చేర్యాల, సెప్టెంబర్ 09 (జనంసాక్షి): తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై కొందరు బీఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలను కొమురవెల్లి దేవస్థాన మాజీ చైర్మన్ ముస్త్యాల కిష్టయ్య తీవ్రంగా ఖండించారు. స్పీకర్ పదవికి ప్రజాస్వామ్యంలో ప్రత్యేక గౌరవం ఉందని, దానిని కించపరిచే వ్యాఖ్యలు శాసనసభ గౌరవాన్ని దెబ్బతీస్తాయని అన్నారు. రాజకీయ భేదాభిప్రాయాలు సహజమే అయినా వ్యక్తిగత, అసభ్య వ్యాఖ్యలకు తావివ్వరాదన్నారు. రాజ్యాంగబద్ధ పదవులను గౌరవిస్తూ రాజకీయాల్లో హుందాతనం, సంయమనం పాటించాలని కోరారు.

ఆగుతూ, సాగుతూ ఎన్నాళ్లు...?

పెబ్బేరు, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): గత ప్రభుత్వ హయాంలో వనపర్తి రోడ్డు విస్తీర్ణం, డ్రైనేజ్ నిర్మాణం ఇరువైపులా చేపట్టాలనుకున్నప్పటికీ ఆగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒకవైపు సాగింది. మళ్లీ కొంతకాలం రెండో వైపు నిర్మాణం ఆగింది. ఆగుతూ సాగుతూ కొనసాగుతూ వస్తుంది. వనపర్తి రోడ్డు నిర్మాణానికి ఇరువైపులా 80 ఫీట్లు చేపట్టాల్సింది. రాజకీయ నాయకుల ఒత్తిడి మేరకు 38 ఫీట్లకు కుదించినట్లు తెలుస్తుంది. ఇప్పటికే ముగ్గురు మున్సిపల్ కమిషనర్లు, ముగ్గురు టీపీవోల్లు మారారు. ఇప్పటికే 95 శాతం మేరకు ఇల్లు కోల్పోయారు. మిగిలిన ఐదు శాతం పనులకు తలనొప్పిగా మారడంతో అధికారులు ప్రజాప్రతినిధులు ఎటు తేల్చుకోలేకపోతున్నారు. యజమానులకు నోటీసులు ఇస్తున్నారు తీసుకుంటున్నారు తప్ప నిర్మాణం మాత్రం పూర్తిస్థాయిలో కొనసాగడం లేదు. ఇప్పటికైనా రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థను వేగవంతంగా పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఇల్లు కోల్పోయిన బాధితులకు సత్వరమే ప్లాట్లు ఏర్పాటు చేయాలని అదేవిధంగా పేదలకు ఇళ్లను నిర్మించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

మాగనూర్, (జనంసాక్షి): మాగనూరు మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామాల ప్రజలకు మాగనూరు పోలీసుల విజ్ఞప్తి వినాయక చవితి సందర్భంగా మాగనూరు మండలంలో ఉన్న గ్రామాల గణేష్ మండపాలు ఏర్పాటు చేయబోయే నిర్వాహకులు తమ మండపాల పూర్తి వివరాలను కింది https://policeportal.tspolice.gov.in/index.htm తెలంగాణ పోలీస్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని మాగనూరు ఎస్ఐ అశోక్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు అదేవిధంగా నమోదు చేసిన వివరాల కాపీని మాగనూరు పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని సూచించారు. మండపాల వివరాలు ముందస్తుగా పోలీసులకు అందించడం ద్వారా అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు మండప నిర్వాహకులతో భద్రతా చర్యలు, నిమజ్జనం, ట్రాఫిక్ తదితర అంశాలపై ముఖ్యమైన సమాచారాన్ని సకాలంలో పంచుకునేందుకు వీలవుతుందని తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు మండప నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్ఐ అశోక్ బాబు విజ్ఞప్తి చేశారు.

కలెక్టరేట్‌లో ఘనంగా కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు

- చిత్రపటానికి నివాళులర్పించిన అదనపు కలెక్టర్ హరిప్రియ

మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 09 (జనంసాక్షి):
మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల్లో చైతన్యం, స్ఫూర్తిని నింపడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. తన కవిత్వం, రచనల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసి, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారని గుర్తు చేశారు.

కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి నిర్మల, ఏవో సువర్ణ రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలను నిర్వహించుకోవాలి

- డీజేలకు అనుమతి లేదు
- మండపాల నిర్వాహకులు ఆన్లైన్ నమోదు తప్పనిసరి
- తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్

తూప్రాన్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):
ప్రశాంతమైన వాతావరణం భక్తి శ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలను వినాయక ఉత్సవ నిర్వాహకులు నిర్వహించుకోవాలని తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్ తెలిపారు .తూప్రాన్ వెల్దుర్తి శివంపేట మనోహరాబాద్ మండలాల వినాయక ఉత్సవ నిర్వాహకుల తో జరిగిన సమావేశంలో తెలిపారు. వినాయక మండపాల వద్ద సీసీ కెమెరాలు తప్పని సరిగా పెట్టుకోవాలని లడ్డు దొంగతనాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఇలాంటి సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. వినాయక మండపాల వద్ద బిజెపి అనుమతులు లేవని చిన్న సౌండ్ బాక్స్‌తో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా భక్తి పాటలు పెట్టుకోవచ్చని తెలిపారు. వినాయక మండపాలకు విద్యుత్ శాఖ వారు ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇస్తారని ప్రతి విగ్రహం వద్ద ఎంసిబి తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచిం చారు. రాత్రి 10 గంటల వరకు మాత్రమే సౌండ్ బాక్స్ అని ప్రతి వినాయక మండపం వద్ద నిర్వాహకులు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఎంతమంది ఎన్ని విగ్రహాలు పెడుతున్నది వెబ్సైట్లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని చెప్పారు. నిమజ్జనం రోజు చెరువుల వద్ద గజతగల ఏర్పాటు చేస్తున్నా మని అవసరమైతే క్రేన్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ జరగకుండా

తీసుకోవాలని విద్యుత్ అధికారులు అందు బాటులో ఉంటారని ఏఈకి సమాచారం ఇవ్వాలని తెలిపారు సిఐ వెంకటరాజు గౌడ్ మాట్లాడుతూ నిమజ్జనం రోజు గజ ఈత గాళ్లు తప్పనిసరిగా ఉంచుకోవాలని అనుభవ మున్న వ్యక్తులతో నిమజ్జనం చేయించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మనోహరాబాద్ వెల్దుర్తి శివంపేట ఎస్సైలు గంగరాజు సుభాష్ గౌడ్ మున్సిపల్ కమిషనర్ రవికుమార్ తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి విద్యుత్ అధికారులు సర్పంచులు సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణలో కామన్ వర్క్ షెడ్ కు శంఖుస్థాపన చేసిన ఎంపి డికె అరుణ

కృష్ణ, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):
నారాయణపేట జిల్లా కృష్ణా మండలం కృష్ణానది తీరంలోని దత్తాత్రేయ ఆలయ సమీపంలో బుధవారం కామన్ వర్క్ షెడ్ కు పాలమూరు ఎంపీ డి కే అరుణ శంకుస్థాపన చేశారు.అనంతరం దత్తాత్రేయ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపి అరుణ మాట్లాడుతు మా కుటుంబానికి ఈ ప్రాంతంతో ఎంతో అవినాభావ సంబంధం ఉందని అన్నారు.మానాన్న చిట్టెం నర్సిరెడ్డి స్ఫూర్తితో అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగ్ పాండు రెడ్డి , జిల్లా బీజేపీ అధ్యక్షులు సత్య యాదవ్ , బీజేపీ నాయకులు బలరాంరెడ్డి , లక్ష్మీ కాంత్ రెడ్డి , లక్ష్మీ శ్యామ్ సుందర్ , భాస్కర్ , మండల బీజేపీ అధ్యక్షుడు నల్లే నర్సప్ప,

జయనంద్ రెడ్డి , అజిత్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి దండు రాఘవేంద్ర, అమర్ దీక్షితులు , సర్పంచ్ పాండు, బీజేవైఎం మండల అధ్యక్షులు వి సురేష్,తదితరులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను తిట్టడం కాదు.. ప్రజలకు సమాధానం చెప్పండి

కేసీఆర్‌పై విమర్శలు ఆపాలి.. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి అభివృద్ధి చేతల్లో చూపిస్తే ప్రజలే అండగా ఉంటారు: బీఆర్ఎస్ నేతలు

కొత్తపల్లి సెప్టెంబర్ 9 (జనంసాక్షి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పదేపదే విమర్శించడం, తిట్టడం మానుకుని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కొత్తపల్లి మండలం దుప్పుడుగట్టు గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.
కేసీఆర్‌పై ఎన్ని విమర్శలు చేసినా ప్రజల్లో ఆయనపై ఉన్న నమ్మకాన్ని దెబ్బతీయలేరని అన్నారు. ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు వస్తుంటే వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. రాజకీయ విమర్శలు, కక్ష సాధింపు చర్యలను పక్కనపెట్టి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు.
మద్దూర్, కొత్తపల్లి ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు పేదలకు ప్లాట్లు, ఇంటి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన కుటుంబాలకు ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సహక

రించాలని కోరారు. "కేసీఆర్‌ను తిట్టడం వల్ల అభివృద్ధి జరగదు.. ప్రజల సమస్యలు తీరవు. చేతల్లో అభివృద్ధి చూపిస్తే ప్రజలే ప్రభుత్వానికి అండగా నిలుస్తారు" అని నాయకులు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ విమర్శలకు స్వస్తి పలికి ప్రజా సమస్యల పరిష్కారం, పారదర్శక పాలన, అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేష్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ అనంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేష్, నాయకులు రామ్‌రెడ్డి, పెద్ద మొగిలిరెడ్డి, లాలు నర్సిములు, రవీందర్‌రెడ్డి, సర్దా వెంకటయ్య, గోపాల్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి
సహకారం: ఎం ఎల్ ఏ గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రపురం, సెప్టెంబర్ 9(జనంసాక్షి): రామచంద్రపురం మండలం పరిధిలోని ఈదుల నాగులపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. బుధవారం ఆలయ నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ రాములు గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు మట్టి వినాయక విగ్రహం అందజేత

సంగారెడ్డి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను బీఆర్ఎస్వీ నాయకుడు అఖిల్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయనకు మట్టి వినాయక విగ్రహాన్ని అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించాలని అఖిల్ కోరారు. ప్రజలు కూడా మట్టి విగ్రహాలను వినియోగించి పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించాలని సూచించారు. మట్టి విగ్రహాల వినియోగంతో నీటి కాలుష్యాన్ని నివారించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని తెలిపారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ మట్టి వినాయక విగ్రహాన్ని స్వీకరించి, పర్యావరణ పరిరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో అసద్, అడ్వాన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి యువ సర్పంచుల గళం

- విద్యుత్ కోతలు, అధ్వానంగా రోడ్లపై మండల సభలో ప్రశ్నలు

న్యాల్‌కల్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):

మండలంలోని విద్యుత్ కోతలు, లోవోల్టేజ్, తాగునీటి సమస్యలు, అధ్వానంగా ఉన్న రోడ్లపై యువ సర్పంచులు అధికారులను ప్రశ్నించారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేకాధికారి యాదగిరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు గ్రామాల సర్పంచులు సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఇద్దరు మృతి చెందగా, నాలుగు పాడి ఆవులు మృతి చెందాయని చీకూర్తి సర్పంచ్ రమేష్ తెలిపారు. చాల్కి–చీకూర్తి–బీదర్ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ ప్రభువులు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో నరేష్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ
పంటలు ఎండిపోయిన రైతులను ఆదుకోవాలి

అమరచింత, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):

బుధవారం మండల కేంద్రంలో సారంపల్లి మల్లారెడ్డి కి జిఎస్ భవనంలో ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎల్లోనివో ప్రభావం వలన రైతులు వేసిన పంటలు ఎండిపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. బి వెంకటేష్.తెలంగాణ రాష్ట్ర రైతు కమిటీ సభ్యులు బుధవారం రోజు జి ఎస్ భవనంలో తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ రైతులకు ఎరువులు విత్తనాలు పురుగుమందులు ఇన్పుట్ సబ్సిడీ వ్యవస్థలను తగ్గించడం అంతర్జాతీయ దిగుమతుల నుండి రక్షణను ఉపసహరించుకోవడం వల్ల సాగు వ్యవసాయం గణనీయంగా పెరిగి వ్యవసాయంలో లాభాలు పడిపోయాయి వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ సంస్థల ప్రవేశం వల్ల చిన్న రైతుల వ్యవసాయ ఉత్పత్తి దెబ్బతింటుంది చిన్న సన్న కారు రైతులకు రుణాలు పెంచాలని డిమాండ్ చేశారు. రైతులు భూములు కోల్పోయి నిరుద్యోగులు లేదా వ్యవసాయ కూలీలుగా మారుతున్నారు అని వారు అన్నారు.
రైతు సంఘం జిల్లా మహాసభలు ఈనెల చివరి వారంలో వనపర్తి జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయి.ఈ మహాసభలకు జిల్లాలో ఉన్నటు వంటి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మండల కమిటీ అధ్యక్షులు రాజు. అంజిరెడ్డి.తిరుపతి.ఆర్యన్. నాగరాజు.చంద్రబాబు. శివ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు ఎమ్మెల్యే కసిరెడ్డి సంఘీభావం

- తాతా మధు వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం
- శాసనసభ గౌరవం,ప్రతిష్ఠను కాపాడేందుకు కఠిన చర్యలు ఁ తీసుకోవాలని వినతి

కల్వకుర్తి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవితో కలిసి బుధవారం అసెంబ్లీలో రాష్ట్ర అసెంబ్లీ వ్యవహారాల ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల శాసనమండలి సభ్యుడు తాతా మధు స్పీకర్ పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలు, ప్రవర్తనపై కసిరెడ్డి నారాయణరెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.స్పీకర్‌కు సంఘీభావం తెలిపారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన కఠినచర్యలు తీసుకుని శాసన సభ గౌరవం, ప్రతిష్ఠను కాపాడాలని మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. శాసనసభ ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీక అని, సభా మర్యాదలు, గౌరవం, సంప్రదాయాలను ప్రతిఒక్కరూ పాటించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఈ నెల 11న
ఎస్జీఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీలు

కొత్తపల్లి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):
కొత్తపల్లి మండలస్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలను ఈ నెల 11న నిడిజింత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎంఈఓ ఆంజనేయులు, పీడీ కతలప్ప తెలిపారు. బుధవారం కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్ భర్త శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జయరాములు, ఎంపీడీఓ కొండన్నలను కలిసి ఆహ్వాన పత్రాలు అందజేశారు.
పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు మాత్రమే పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో అండర్-14 విభాగంలో 2013 తర్వాత, అండర్-17 విభాగంలో 2010 తర్వాత జన్మించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. కార్యక్రమంలో కే.శ్రీనివాస్, దేవేందర్,హన్మంతు పాల్గొన్నారు.

ఉచిత బస్సులతో పురుషులపై భారం

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం.బి. బాలకృష్ణ

జడ్చర్ల, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): ప్రస్తుత కరువు పరిస్థితుల్లో ఉచిత బస్సు సౌకర్యం వల్ల అనవసర ప్రయాణాలు పెరిగాయని, మగవారిపై చార్జీల భారం రెట్టింపైందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం.బి. బాలకృష్ణ అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో చార్జీలు పెరిగినా పురుషులకు సీట్లు దొరకక నిలబడి ప్రయాణించాల్సి వస్తోందన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జడ్చర్ల నుండి హైదరాబాద్‌కు బస్సు టికెట్ రూ.200 ఉంటే, అదే రైలు ప్రయాణమైతే సికింద్రాబాద్ లేదా బేగంపేట్ వరకు కేవలం రూ.25 మాత్రమేనని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆర్టీసీలో డీజిల్ బస్సులు పెంచి ప్రయాణ చార్జీలను 50 శాతం తగ్గించాలని, 60 ఏళ్లు దాటిన వయో వృద్ధులకు ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు. పాడి పరిశ్రమ వల్ల కల్తీ పాల సమస్య తగ్గడమే కాకుండా, సేంద్రీయ ఎరువులతో నాణ్యమైన పంటలు పండి ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందని తెలి పారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, ఆర్థిక పురోగతికి ఉపయోగపడే పథకాలను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

ప్రజా కవి కాళోజీ జీవితం నేటి తరానికి ఆదర్శం: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 09 (జనంసాక్షి): ప్రజా కవి కాళోజీ నారాయణరావు జీవితం, సాహిత్య స్ఫూర్తి, ప్రజా సమస్యలపై ఆయన చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ పాండు జ్యోతి ప్రజ్వలన చేసి, కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. కాళోజీ తన రచనల ద్వారా ప్రజల సమస్యలు, ఇబ్బందులను సమాజం ముందుకు తీసుకువచ్చి ప్రజల్లో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని పెంపొందించారని అన్నారు. ప్రజల పక్షాన నిలబడి సామాన్యుల గొంతుకగా తన సాహిత్యాన్ని మలిచిన కాళోజీ ప్రజా కవిగా చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. సమాజంలోని అసమానతలు, ప్రజల సమస్యలు, సామాజిక పరిస్థితులపై తనదైన శైలిలో స్పందిస్తూ ప్రజలను చైతన్య పరిచిన మహనీయుడు కాళోజీ అని కొనియాడారు. ఆయన ఆలోచనా విధానం, ప్రజల పట్ల ఉన్న నిబద్ధత యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. యువత కాళోజీ జీవితం, సాహిత్యం, ఆలోచనా విధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ సూచించారు.

కాళోజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ.. కాళోజీ నారాయణరావు కేవలం కవిగా మాత్రమే కాకుండా సామాజిక చైతన్యవేత్తగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. తెలంగాణ సాధన ఉద్యమంలో కాళోజీ సాహిత్య స్ఫూర్తి, ఆయన రచనలు ప్రజల్లో గొప్ప చైతన్యాన్ని నింపాయని పేర్కొన్నారు. ఆయన సాహిత్యం నేటికీ ప్రజల్లో చైతన్యాన్ని కలిగిస్తోందని, కాళోజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్, డీపీఆర్వో విజయలక్ష్మి, కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

తాతా మధును
పదవి నుంచి తొలగించాలి

హత్నూర, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):
తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే పదవి నుంచి తొలగించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. హత్నూర మండలం దౌల్తాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. తాతా మధుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి అహంకారపూరితంగా వ్యవహరించడం సరికాదని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మీనంపల్లి కిషన్‌రావు, యాదగిరి, బేగరి శ్రీహరి, కృష్ణ, ఆంజనేయులు, నవీన్‌కుమార్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

6 గ్యారంటీలు,
420 హామీలు వెంటనే అమలు చేయాలి

అమ్రాబాద్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ నిమ్మల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అమ్రాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హామీలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులను ఊర్లలో తిరగనివ్వమంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు రౌడీ రాజకీయాలకు నిదర్శనమన్నారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడి ఘటనను ఖండించారు. ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై చర్చకు సిద్ధంగా ఉండాలని సవాల్ చేశారు. ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ భయపడదని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి గడపకు తీసుకెళ్తామని అన్నారు. నల్లమలకు సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు కనిపిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ నాయకుడు శ్రీకాంత్ భీమపై అనుచిత వ్యాఖ్యలు చేయొద్దని హెచ్చరించారు. సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గణేష్‌పల్లి పాలీహౌస్
నర్సరీలో రావెప్ విద్యార్థుల పర్యటన

- రక్షిత సాగు పద్ధతులపై ఆచరణాత్మక అవగాహన

మర్కుక్, సెప్టెంబరు 9(జనంసాక్షి):

గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమం (రావెప్)లో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సిరిసిల్ల కళాశాలకు చెందిన బి.ఎస్సీ. అగ్రికల్చర్ విద్యార్థులు మర్కుక్ మండలం గణేష్‌పల్లి గ్రామంలోని కూరగాయల పాలీహౌస్ నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా రక్షితసాగు విధానాలు, నీటిపారుదల, ఎరువుల వినియోగం, పంటల నిర్వహణతో పాటు తెగుళ్లు, వ్యాధుల నియంత్రణపై విద్యార్థులు ప్రత్యక్షంగా అవగాహన పొందారు. ఆధునిక కూరగాయల ఉత్పత్తిలో అనుసరిస్తున్న సాంకేతిక పద్ధతులను పరిశీలించిన విద్యార్థులు.. పాలీహౌస్ నర్సరీ నిర్వహణ, మొక్కల పెంపకం, పంట సంరక్షణ విధానాలపై ఆచరణాత్మక జ్ఞానాన్ని పొందారు. తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించే అవకాశం రావడం ద్వారా ఆధునిక వ్యవసాయ పద్ధతులపై విలువైన అనుభవం లభించిందని రావెప్ విద్యార్థులు బి. డింపుల్, డి. మేఘన, జె. అంకిత, కె. సుచిత్ర, ఎస్. నవ్య తెలిపారు.

ప్రజా సమస్యలు ప్రశ్నిస్తే సస్పెన్షనా?

గండీడ్, సెప్టెంబరు 09 (జనంసాక్షి): అసెంబ్లీ సమావేశాల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మొత్తం సమావేశాల కాలానికి సస్పెండ్ చేయడం దారుణమని మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి ఖండించారు. ప్రజా సమస్యలను ప్రస్తావిస్తున్న ప్రతిపక్ష ఎమ్మెల్యేల గొంతు నొక్కడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యిరోజుల పాలన పూర్తయినా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. 22ఏ భూముల సమస్య, ఫీజు రీయింబర్స్‌మెంట్, జీవో 97, రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనాలు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు, 420 హామీల అమలుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని తెలిపారు. సస్పెన్షన్‌తో సమస్యలు పరిష్కారం కావని, ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం కల్పించి, సస్పెన్షన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల హక్కుల సాధన
10న చలో హైదరాబాద్‌లో ధర్నా

అమరచింత (జనంసాక్షి):

మండల కేంద్రంలోని బుధవారం నాడు పి.ఆర్.టి యు.టి ఎస్. అమరచింత మండల శాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీవో పి. శ్రీనివాసులు చేతుల మీదగా ధర్నాపోస్టర్ విడుదల చేశారు. ఈనెల 10వ తేదీన హైదరాబాదులో ఉద్యోగుల హక్కుల సాధన కొరకు విడతల వారీగా న్యాయమైన పద్ధతిలో ఉద్యోగాల సంఘాల సమస్యలను పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు టీజీ జేఏసీ. పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సద్దల శ్రీనివాసులు మండల అధ్యక్షుడు రాజు యూటీఎఫ్ నాయకులు రాములు, నాలుగో తరగతి ఉద్యోగ సంఘం అధ్యక్షులు ఎండి గౌస్ వివిధ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రూ.20 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 09 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్‌రామ్ రూ.20 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఓ కళాశాలకు అనుకూలంగా రిపోర్టు ఇచ్చేందుకు రూ.50 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఇప్పటికే కళాశాల యాజమాన్యం రూ.30 వేలు చెల్లించగా, మిగిలిన రూ.20 వేలు ఇవ్వాలని అధికారి ఒత్తిడి చేసినట్లు సమాచారం. దీంతో కళాశాల యాజమాన్యం ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. పథకం ప్రకారం బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో గోవింద్‌రామ్ రూ.20 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అనంతరం నగదును స్వాధీనం చేసుకుని, సంబంధిత అధికారిపై కేసు నమోదు చేశారు. ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ దాడిలో ఏసీబీ డీఎస్పీ సుదర్శన్, ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి పాల్పడే అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొన్నారు.

ప్రజా పోరాటాలతోనే హక్కుల సాధన

జడ్చర్ల, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): ప్రతి మనిషి అభివృద్ధి చెందినప్పుడే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కిల్లే గోపాల్ అన్నారు. జడ్చర్లలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సీపీఎం రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు హక్కుల సాధన కోసం కమ్యూనిస్టు పార్టీ, ప్రజా సంఘాల పిలుపుల్లో చైతన్యంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. నల్లవెల్లి కురుమూర్తితో కలిసి ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ 24వ మహాసభ కర్తవ్యాలపై చర్చించారు. ప్రజా ఉద్యమాలు నిర్వహించి ప్రజలను సమీకరించాలని, పార్టీ శాఖలు, ప్రజా సంఘాలను బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

• వ్యవసాయ అధికారి రాంప్రసాద్

టేక్మాల్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్ తెలిపారు. ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. భూమి కలిగిన ప్రతి రైతు భూ యాజమాన్య వివరాలు, వ్యక్తిగత సమాచారంతో ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు కావాలని సూచించారు. పీఎం కిసాన్‌తో పాటు రైతు భరోసా, రుణమాఫీ, పత్తి, ధాన్యం కొనుగోలు, యూరియా, ఇతర ఎరువుల బుకింగ్ వంటి పథకాలు, సేవలు పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని తెలిపారు. రైతులు ఆధార్‌కార్డు, భూ యాజమాన్య పాస్‌బుక్, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో ఐదు క్లస్టర్ల పరిధిలో వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి వెంటనే ఫార్మర్ ఐడీ నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని రాంప్రసాద్ సూచించారు.

కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు..
ఎమ్మెల్యే శంకర్‌పై ఫిర్యాదు

పెద్ద శంకరంపేట్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసి కెసిఆర్ చావుని కోరి తెలంగాణ రాష్ట్ర పరువు మంట కలిపిన కాంగ్రెస్ ఎమ్మెల్యే చీర్లపల్లి శంకర్ పై బుధవారం పెద్ద శంకరంపేట లోని పోలీస్ స్టేషన్ లో మండల బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. భవిష్యత్తులో ఎవరు కూడా ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పేట మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ .. మాజీ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ.వి ఆర్ ఎస్ పార్టీ నాయకులు సురేష్ గౌడ్. మాణిక్ రెడ్డి సుభాష్ రమేష్ అంజయ్య వెంకట్ రెడ్డి శంకర్ గౌడ్ అశోక్ చంద్రకాంత్ వెంకటేశం శివకుమార్ సిద్దు అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు దీక్షలో గాయపడిన సర్పంచ్‌కు పరామర్శ

మార్కుక్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): మార్కుక్‌లో రైతుదీక్ష సందర్భంగా పోలీసుల తోపులాటలో గాయపడిన శివార్ వెంకటాపూర్ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు తుమ్మల కనకయ్యను గజ్వేల్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు. మండల అధ్యక్షుడు కర్ణాకర్‌రెడ్డితో కలిసి ఆయన కనకయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వైస్ చైర్మన్ మంద బాల్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణయాదవ్, మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు సాయిని మహేష్, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్యలను సందర్శించిన బీహార్ అధికారుల బృందం

సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 09 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లాలో సెర్ప్-ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో అమలవుతున్న మహిళా సాధికారత కార్యక్రమాలను బీహార్ గ్రూప్--1 అధికారుల బృందం ప్రశంసించింది. హైదరాబాద్‌లో శిక్షణలో భాగంగా వచ్చిన 120 మంది అధికారులు బుధవారం జిల్లా మహిళా సమాఖ్యను సందర్శించారు. సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాలు నిర్వహిస్తున్న స్వయం ఉపాధి, వ్యాపార కార్యకలాపాలను అధికారులు పరిశీలించారు. మహిళా వ్యాపారవేత్తలతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం మహిళా శక్తి పెట్రోల్ బంక్, వాణిజ్య దుకాణ సముదాయం, ఫసల్వాడిలోని కేఎస్ఆర్ సాక్స్ యూనిట్‌ను సందర్శించారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పించడంలో మహిళా సంఘాల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య సభ్యులు, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచుల అరెస్ట్‌పై భగ్గుమన్న నాయకులు... ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులా?

గుమ్మడిదల, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సర్పంచులను అరెస్టు చేయడంపై నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గుమ్మడిదల మండలంలోని అనంతారం, కొత్తపల్లి, నాగిరెడ్డిగూడెం గ్రామాల సర్పంచుల అరెస్టులను వారు ఖండించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం.. సమస్యలను ప్రస్తావిస్తున్న ప్రజాప్రతినిధులపై పోలీసులను ప్రయోగించడం సరికాదన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించడం, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం సర్పంచుల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల గొంతును అణిచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.

హామీలు అమలు చేయాలి...

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. గ్రామాల్లో మౌలిక వసతులు, తాగునీరు, రోడ్లు తదితర ప్రజా సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న నాయకులను అరెస్టు చేసినంత మాత్రాన సమస్యలు పరిష్కారం కావని అన్నారు. అరెస్టులతో ఉద్యమాలను అణిచివేయాలని చూస్తే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజాప్రతినిధుల హక్కులను కాపాడుతూ గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సర్పంచులు కొమ్ము శ్రీను, సూరారం సత్తయ్య, గోవర్ధన్‌రెడ్డి, ఉప సర్పంచ్ యాదిరెడ్డి, వార్డు సభ్యులు గోసుకొండ సాయిరెడ్డి, భాస్కర్‌గౌడ్, సీనియర్ నాయకులు గోపాల్ ముదిరాజ్, పెరుగు లక్ష్మణ్, మహేష్ యాదవ్, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక రవాణా
చేస్తున్న బొలెరో వాహనం పట్టివేత

• కేసు నమోదు చేసిన పోలీసులు

కోహెడ, సెప్టెంబర్ 09 (జనంసాక్షి): ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న బొలెరో వాహనాన్ని కోహెడ పోలీస్‌లు పట్టుకున్నారు. బుధవారం రోజున చిగురుమామిడి మండలం రామంచ గ్రామం నుండి కోహెడ మీదుగా సిద్దిపేటకు బోలెరో వాహనంలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా కోహెడ గ్రామ శివా రులో కోహెడ పోలీస్ వారు బోలెరో వాహనాన్ని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి, నిందితునిపై కేసు నమోదు చేయడం జరిగిందని పుల్ల అభిలాష్ తెలిపారు. బోలెరో వాహనం టీజీ 02- టి 4931, జెట్టి అజయ్ సాగర్ (28) సంవత్సరాలు, గ్రామం.నవాబుపేట, మం డలం చిగురుమామిడి చెందిన అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పుల్ల అభిలాష్ తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని అలాగే జైలు శిక్ష కూడా తప్పదని ఈ సందర్భంగా ఎస్ఐ హెచ్చరించారు.

ఆలయంలో హుండీ లెక్కింపు

అమీన్‌పూర్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): బీరంగూడ గుట్ట శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు సమక్షంలో, ఆలయ ఈవో దేవ దేవదాసం, చైర్మన్ సుధాకర్ యాదవ్ పర్యవేక్షణలో లెక్కింపు ప్రక్రియ నిర్వహించారు. హుండీ ఆదాయం మొత్తం రూ.13,69,009 వచ్చింది. ఈ సందర్భంగా కార్యనిర్వహణ అధికారి దేవదానం, చైర్మన్ సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తామని తెలిపారు. హుండీ లెక్కింపునకు సహకరించిన భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, కమిటీ సభ్యులు, అర్చకులు, మహిళా భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొలం బడి కార్యక్రమం
రైతులకు ఎంతో ఉపయోగకరం

కొల్చారం, సెప్టెంబర్ 09 (జనంసాక్షి): రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు పొలం బడి కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని డా. ప్రతాప్‌రెడ్డి తెలిపారు. పోతిరెడ్డిపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. నేల సార పరిరక్షణ, జీవ ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, నీటి యాజమాన్యం, ఆధునిక సాగు విధానాలు, సాగు ఖర్చుల తగ్గింపు, అధిక దిగుబడుల సాధనపై సూచనలు అందించారు. పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి, ఎరువులను సరైన మోతాదులో ఉపయోగించాలని సూచించారు. శాస్త్రవేత్తలు సూచించే ఆధునిక పద్ధతులను పాటించడం ద్వారా దిగుబడులు, వ్యవసాయ ఆదాయం పెంచుకోవచ్చన్నారు. నాలుగు వారాలపాటు పంట కాలంలో శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. రైతులు పొలం బడి కార్యక్రమంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శ్వేతాకుమారి, ఏటీఎం, ఏఈఓ గౌతమి, సర్పంచ్, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

మట్టి గణపతి
విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ

ఖిల్లా ఘనపూర్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో మట్టి విగ్రహాలను ప్రతిష్టించి పర్యావరణాన్ని కాపాడాలని తహసీల్దార్ బి.సుగుణ సూచించారు. రసాయనాలు, రంగులతో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల చెరువులు, కుంటలు, నీటి వనరులు కలుషితమై, జలచరాలకు హాని కలిగే అవకాశం ఉందన్నారు. మట్టి విగ్రహాలు పర్యావరణహితంగా ఉండటంతో నీటిలో సులభంగా కలిసిపోతాయని తెలిపారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించడంతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. పర్యావరణానికి హాని కలిగించే వస్తువులను నివారించి, గణపతి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణహితంగా నిర్వహించాలని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు.

పెద్దొడ్డిలో కాళోజి జయంతి

మద్దకల్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని పెద్దొడ్డిలో ప్రాథమిక పాఠశాలలో బుధవారం తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, ఉపాధ్యాయులు చక్రధర్, నాగరాజు కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ భాష, యాసకు కాళోజీ తెచ్చిన గుర్తింపును, ఆయన రాసిన రచనలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. పుటక నీది,చావు నీది బతుకంతా దేశానిది అంటూ కాళోజీ సమాజానికి అందించిన సందేశాన్ని గుర్తుచేశారు. మాతృభాష ప్రాముఖ్యతను కాపాడుకోవాలని, తెలంగాణ భాషా సౌందర్యాన్ని భావితరాలకు అందించాలని ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీఎంజేఎఫ్ మహాసభలకు
ఎస్సై, సర్పంచ్ సంఘీభావం

ఉప్పునుంతల, (జనంసాక్షి):
తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం (టీఎంజేఎఫ్) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 12న హైదరాబాద్ కోఠి బీసీసీఈ భవన్‌లో నిర్వహించ నున్న 3వ రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఉప్పునుంతల ఎస్సై పుట్ట మహేష్, సర్పంచ్ చింతగల శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎంజేఎఫ్ నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, భద్రతతో పాటు సామాజిక సమస్యల పై మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఫోరం కృషి చేస్తోంద న్నారు. అచ్చంపేట ప్రాంతం నుంచి జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు ముంబై ఉద్యమకారులు

కోహెడ, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):
తెలంగాణ రాష్ట్ర సాధనలో ముంబై ప్రాంత ఉద్యమకారుల పాత్ర కీలకమని భారత్ లేబర్ సేవ సంఘం (బీఎల్ఎస్ఎస్) నేతలు తెలిపారు. బీఎల్ఎస్ఎస్, ముంబై తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎంటీజేఏసీ) ఆధ్వర్యంలో పశ్చిమ ములుండ్‌లో సమావేశం నిర్వహించారు. ఎంటీజేఏసీ నాయకుడు ఏటం అజయ్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో కేకే కమిటీ ఏర్పడినప్పటి నుంచి తమ సమన్వయకర్తల బృందం మూడు సమావేశాలకు హాజరైందన్నారు. కమిటీ సూచనల మేరకు ఆధారాలతో త్వరలో 'చలో హైదరాబాద్' కార్యక్రమం చేపడతామని ప్రకటించారు. తెలంగాణ సాధనలో ముంబై ఉద్యమకారుల పాత్రను గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో సావరీ దత్తా యాదవ్, పొన్నాల అంజయ్య మహారాజ్, అందే శ్రీను, మల్లేష్, బనప్పా, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో
వీవో భవనానికి భూమిపూజ

కొల్చారం, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):
కొల్చారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న వీవో భవనానికి బుధవారం గ్రామ సర్పంచ్ దేవన్నగారి శేఖర్ భూమిపూజ నిర్వహించారు. భవన నిర్మాణం పూర్తయితే సంబంధిత సేవలకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని గ్రామస్థులు తెలిపారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ మారుతి, సీడీపీవోలు స్వరూప, సంతోష్, ఉపసర్పంచ్ కోరంపల్లి రాణి గోపి, కాంగ్రెస్ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, వార్డు సభ్యులు, అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ హెచ్ఎంగా వరలక్ష్మి

- **పెద్దగూడెం కాంప్లెక్స్ జీహెచ్ఎంకు ఘన సన్మానం.. విద్యాభివృద్ధికి చేసిన సేవలకు గుర్తింపు**

వనపర్తి రూరల్, సెప్టెంబర్ 09,(జనంసాక్షి):
జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలిగా ఎంపికైన పెద్దగూడెం కాంప్లెక్స్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మిని పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించింది. పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గద్దె భాస్కర్ మాట్లాడుతూ.. విద్యాభివృద్ధి, విద్యార్థుల ఉన్నతికి వరలక్ష్మి అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అంకితభావం, సమర్థవంతమైన నాయకత్వంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేసినందుకు జిల్లా ఉత్తమ హెచ్ఎంగా గుర్తింపు లభించిందన్నారు. ఈ గౌరవం తోటి ఉపాధ్యాయులకు గర్వకారణమని పేర్కొంటూ, భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని వరలక్ష్మికి శుభాకాంక్షలు తెలిపారు.

ఉప సర్పంచుల చెక్ పవర్ రద్దు చేయాలి

శివ్వంపేట, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): ఉప సర్పంచుల చెక్ పవర్ కారణంగా గ్రామపంచాయతీల అభివృద్ధి పనులు, నిధుల విడుదలలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని శివ్వంపేట మండల సర్పంచులు తెలిపారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బుర్ర మురళీగౌడ్ మాట్లాడుతూ పారిశుధ్యం, తాగునీరు, అత్యవసర పనులకు నిధులు ఖర్చు చేసే సమయంలో చెక్ పవర్ విషయంలో సాంకేతిక, రాజకీయ ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సర్పంచులకే పూర్తి ఆర్థిక అధికారాలు కల్పించి, ఉప సర్పంచుల చెక్ పవర్‌ను రద్దు చేయాలని కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు మురళీగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో అయ్యగారి యాదగిరి, పుష్ప నర్సింహులు, లక్ష్మిదుర్గ నాయక్, మౌనిక మురళీకృష్ణ, కేతావత్ నరేష్, సుమత, వేణుగోపాల్‌రెడ్డి, అరుణరెడ్డి, రావెల్లి సాయిలు, లక్ష్మి, గేమ్‌సింగ్, విజయ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలి

కంగ్టి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):
విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ముర్కుంజాల్ సర్పంచ్ సారంగి అనూష కోరారు. బుధవారం ముర్కుంజాల్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి తరగతి గదులు, హాజరు, బోధన, పరిసరాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. పాఠశాల సమస్యలను డీఈఓ, ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం గుడ్లు, పండ్లు, ఇతర పౌష్టికాహారం అందుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, విద్యా ప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించి అన్ని సౌకర్యాలు, పౌష్టికాహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. తనిఖీలో సాయగౌడ్ పాల్గొన్నారు.

లోకకల్యాణంలో యాగాలకు విశిష్ట స్థానం

వనపర్తి రూరల్, సెప్టెంబర్ 09 (జనంసాక్షి):
ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాల కోసం వనపర్తిలో 15 రోజుల పాటు నిర్వహించనున్న విశ్వశాంతి మహాయాగంకు శ్రీశ్రీశ్రీ కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ సంకల్పించడం అభినందనీయమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. యాగాలు లోకకల్యాణంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.
మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వాసంతి నిరంజన్ రెడ్డి దంపతులు ఆయుత చండీయాగం హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్ఛారణల మధ్య దంపతులను ఆహ్వానించి పట్టు వస్త్రాలు అందజేసి ఆశీర్వదించారు. పూర్ణాహుతి అనంతరం తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ భక్తులు మహాయాగంలో పాల్గొని ప్రజల శ్రేయస్సు కోసం సంకల్పించిన శ్రీ సీతారామ పట్టాభిషేకం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, గంధం పరంజ్యోతి, సునీల్ వాల్మీకి, చిట్యాల రాము, మంద రాము, లక్ష్మణ్ గౌడ్, శివ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా కాళోజీ జయంతి

- **ప్రజా కవి కాళోజీ నారాయణ తెలంగాణ గుండె చప్పుడు**

గద్వాల, సెప్టెంబర్ 9 (జనంసాక్షి)టీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొంగళ్ళ రంజిత్ కుమార్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల జీవన విధానం, భాష, యాస, సంస్కృతిని తన రచనల్లో ప్రతిబింబించిన మహోన్నత ప్రజాకవి అని కొనియాడారు. తెలంగాణ భాషకు, యాసకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో ఆయన కృషి చిరస్మరణీయమని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, సంస్కృతిని కాపాడటంలో ఆయన పాత్ర కీలకమన్నారు. సామాన్య ప్రజల జీవితాలకు అద్దం పట్టేలా ఆయన రచనలు ఉన్నాయని, ప్రజల సమస్యలను నిర్భయంగా ప్రశ్నించిన ఆయన స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బుచ్చిబాబు, గట్టు మండల అధ్యక్షుడు బలరాం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే బ్రిడ్జి మంజూరుపై హర్షం

• అధికారులకు ఎంపీ రఘునందన్ రావు అభినందనలు

శివ్వంపేట, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):

సంగారెడ్డి నుంచి నర్సాపూర్, శివ్వంపేటలా మీదుగా తూప్రాన్, గజ్వేల్, సిద్ధిపేట అలాగే అటువైపు ఆదిలాబాద్, నిజామాబాద్, ఇటువైపు హైదరాబాద్ ఇతర పట్టణాలకు వెళ్లేందుకు జాతీయ రహదారి 161 ఏ ఏ పై బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జిని మంజూరు చేసినందుకు ఎంపీ రఘునందన్ రావు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మెదక్ జిల్లా బీజేపీ నాయకులతో కలిసి దక్షిణ మధ్య రైల్వే జీఎం, ఉన్నత అధికారులను కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా నర్సాపూర్, గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు పడుతున్న బ్రాహ్మణపల్లి రైల్వే క్రాసింగ్ ఎల్సీ నెంబర్ 236ఏ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి, 235ఏ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి నివేదికలను సిద్ధం చేసి, బ్రిడ్జి నిర్మాణానికి మంజూరు చేసిన సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులకు మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆయన అన్నారు. వచ్చే ఏడాది లోపే బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయించి, ప్రారంభం చేసియిస్తామని రైల్వే అధికారులు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా పార్టీ అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్, బీజేపీ మండల అధ్యక్షులు పెద్దపులి రవి, సీనియర్ నాయకులు పాపగారి రమేష్ గౌడ్, సంగసాని సురేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకన్నగారి కొండల్ రావు, నర్సాపూర్ పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు, అల్లీపూర్ సర్పంచ్ చింతకాయల కుమార్, దాసరి నర్సమ్మ దుర్గయ్య, ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకలి భిక్షపతి తదితరులు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

• నర్సాపూర్‌లో డీఎస్పీ ఆధ్వర్యంలో సమావేశం

నర్సాపూర్ సెప్టెంబర్ 9 (జనంసాక్షి):

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసుశాఖ సూచించిన నిబంధనలు, భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ సూచించారు. నర్సాపూర్ పట్టణంలోని యాదవ ఫంక్షన్ హాల్‌లో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై ఆయన ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.సమావేశానికి నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, వినాయక మండపాల నిర్వాహకులు, ఆర్గనైజర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మండపాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా నిర్వాహకులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులకు సహకరించాలని కోరారు.

అనంతరం డీఎస్పీ తూప్రాన్ నర్సాపూర్ పట్టణంలోని రాయరావు చెరువును సందర్శించారు. వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం ఏర్పాటు చేయాల్సిన ప్రదేశాన్ని సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఉత్సవాలు సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని అధికారులు తెలిపారు.

రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యం: వంగ రాజేశ్వర్ రెడ్డి

• రైతులకు కనీసం 18 గంటల పాటు ఉచిత, నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి • వర్షాభావ పరిస్థితుల్లో చెరువులు, కుంటలను సాగునీటితో నింపాలని డిమాండ్ • విద్యుత్ సమస్యపై గౌరవ ఎస్ఈ గారికి వినతిపత్రం సమర్పణ

నంగునూరు, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):

రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు రాజకీయాలకు అతీతంగా వారికి అండగా నిలబడటమే తన ప్రధాన బాధ్యతని నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, పార్టీలతీతంగా నిర్వహించిన భారీ రైతు ర్యాలీలో పాల్గొని ఆయన తన పూర్తి మద్దతు ప్రకటించారు. అనంతరం వర్షాభావ పరిస్థితులు, విద్యుత్ కొరతపై అధికారుల దృష్టికి తీసుకెళ్తూ గౌరవ ఎస్ఈ (SE) గారికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... వర్షాలు సకాలంలో కురవక పంటలు ఎండిపోయే ప్రమాదంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇస్తున్న 10 గంటల కరెంట్ వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రైతు పంటను కాపాడాలంటే వెంటనే విద్యుత్ సరఫరాను పెంచి కనీసం 18 గంటల పాటు నిరంతరాయంగా అందించాలని డిమాండ్ చేశారు.

సిద్దిపేట చుట్టుపక్కల ప్రధాన కాల్వలు ఉన్నప్పటికీ, చెరువుల్లోకి సాగునీరు చేరకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అందుబాటులో ఉన్న నీటి వనరులను వినియోగిస్తూ చెరువులు, కుంటలను సాగునీటితో నింపేలా చర్యలు చేపట్టాలని అధికారులను, ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రైతుల పక్షాన ఎల్లవేళలా పోరాడేందుకు తాను సిద్ధంగా ఉంటానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

బీసీ యువత జిల్లా ప్రధాన కార్యదర్శిగా సాయి పటేల్

సంగారెడ్డి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):

జాతీయ బీసీ సంక్షేమ సంఘం సంగారెడ్డి జిల్లా బీసీ యువత ప్రధాన కార్యదర్శిగా సాయి పటేల్ నియమితులయ్యారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో ఈ నియామకం జరిగింది. తనకు ఈ అవకాశం కల్పించిన డా. రాగా అరుణ్‌కుమార్‌కు సాయి పటేల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీల హక్కుల సాధన కోసం మరింత కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతి రామకృష్ణ, బీసీ సంఘం నాయకుడు దశరథ్‌కు కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బీసీ యువతను సంఘటితం చేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

తోషిబా ప్లాంట్‌లో డిగ్రీ విద్యార్థుల సందడి

మునిపల్లి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):

మునిపల్లి మండలంలోని బుదేరా మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం తోషిబా కంపెనీ ప్లాంట్‌ను సందర్శించారు. విద్యార్థుల్లో పారిశ్రామిక అవగాహన పెంపొందించడంతో పాటు భవిష్యత్ ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ఈ విద్యా పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా తోషిబా హెచ్ఆర్ ప్రతినిధులతో ఉద్యోగ అవకాశాలు, నియామక విధానం, అవసరమైన నైపుణ్యాలు, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌పై విద్యార్థులు చర్చించారు. భవిష్యత్‌లో కళాశాల విద్యార్థులకు తోషిబా సంస్థలో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా క్యాంపస్ నియామక ప్రక్రియ నిర్వహించే అంశంపై సానుకూల చర్చలు జరిగాయి. ప్లాంట్ సందర్శన ద్వారా పరిశ్రమల పనితీరు, వివిధ విభాగాల కార్యకలాపాలు, నియామక ప్రక్రియపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన లభించింది.

రాజగోపాల్ పేట యువకుడికి
ఉస్మానియా విశ్వవిద్యాలయ డాక్టరేట్

నంగునూరు, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాజగోపాల్ పేటకు చెందిన రాచకొండ కిషోర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన 85వ స్నాతకోత్సవంలో తెలంగాణ గవర్నర్, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ అందుకున్నారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో 'సౌర విద్యుత్, పవర్ మేనేజ్‌మెంట్' అంశంపై చేసిన పరిశోధనకు ఈ పట్టా లభించింది. పేదరిక నేపథ్యం నుంచి వచ్చినప్పటికీ పట్టుదలతో చదివి ఉన్నత విద్యలో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు. కిషోర్‌ను పలువురు అభినందించారు.

విద్యార్థులకు కంప్యూటర్ విద్య ఎంతో అవసరం

• మండల విద్యాధికారి జయశంకర్

ఖిల్లా ఘనపురం, సెప్టెంబర్ 09 (జనంసాక్షి):

ఆధునిక యుగంలో విద్యార్థులకు కంప్యూటర్ విద్య ఎంతో అవసరమని మండల విద్యాధికారి జయశంకర్ అన్నారు. మండల పరిధిలోని మామిడిమాడ గ్రామంలో విద్యార్థుల కోసం ఏ-ఎక్సెఎల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అవసరమైన కంప్యూటర్లను గ్రామానికి చెందిన చాంద్‌పాష్ రూ.20,000 వెచ్చించి అందించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి జయశంకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ఎంతో అవసరమన్నారు. పాఠశాలకు గ్రామస్తులు సహకారం అందించడం అభినందనీయమని, భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి మరింత సహకారం అందించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి గీతాంజలి కంప్యూటర్లను అందించిన దాత చాంద్ పాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాలింగం, ఉపసర్పంచ్ భద్రయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చెన్నప్ప, ఉపాధ్యాయులు రవికిరణ్, తేజస్విని, గ్రామస్తులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి రోజులైనా.. హామీలు అమలేదీ..?

• ఇంటింటికీ బాకీ కార్డులు.. బీఆర్ఎస్ భారీ ర్యాలీ

కల్వకుర్తి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జీడిపల్లిలో నిరసన నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకుడు ఉప్పల వెంకటేష్ పిలుపుతో పార్టీ శ్రేణులు గ్రామంలోని వీధుల్లో పర్యటించి ప్రజలకు హామీల అమలుపై వివరించారు. ఇంటింటికీ బాకీ కార్డులు పంపిణీ చేసి, ఇళ్లకు కరపత్రాలు ఏర్పాటు చేశారు. అనంతరం డప్పులు, బ్యాండ్ వాయిద్యాలతో భారీ ర్యాలీ చేపట్టారు. మాజీ సర్పంచ్ కల్పనా కృష్ణయ్య మాట్లాడుతూ వెయ్యి రోజులు గడిచినా ఆరు గ్యారంటీలు, 420 హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. మాజీ ఉపసర్పంచ్ ఎండీ ఖాజా మైనుద్దీన్ హామీలపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని అరెస్టు చేయాలి

వీపనగండ్ల, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):

మాజీ సీఎం, ప్రతిపక్ష నేత కేసీఆర్‌పై మరణాన్ని కోరుతూ, హాని చేయడానికి ప్రేరేపించేలా వ్యాఖ్యలు చేశారంటూ షాద్‌నగర్ ఎమ్మెల్యే కె.శంకర్‌పై బీఆర్ఎస్ వీపనగండ్ల మండల కమిటీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎమ్మెల్యే శంకర్‌తో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, ఇతరులపై బీఎన్ఎస్-2023లోని సెక్షన్లు 196, 351(3), 352, 353, 61 కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయాలని కోరారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఎమ్మెల్యే శంకర్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, జొల్లు నారాయణ, నారాయణరెడ్డి, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

మల్దకల్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):

ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని మల్దకల్ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల విద్యాధికారి జి.సురేష్ మాట్లాడుతూ తెలంగాణ భాష మన అస్తిత్వానికి ప్రతీకని, యాస, భాష, సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

శభాష్ నిత్యశ్రీ...

క్రీడలతో ఉన్నత శిఖరాలు అందుకోవాలి

• జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): కరాటేలో 16 స్టేట్ ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్స్ ,4 ఛాంపియచీప్లు సాధించిన మెదక్ పట్టణానికి చెందిన నిత్యశ్రీని అభినందించి, శాలువాతో సత్కరించారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపారు. జీవితంలో ఉన్నత శిఖరాలు అందుకోవాలని విద్యార్థికి సూచించారు. నగేష్ మల్లూరి సారధ్యంలో శిక్షణ తీసుకొని పతకాలన్నీ సాధించానని,ఇంటర్నేషనల్ బ్రూస్లీ ఐకాన్ అవార్డ్ సైతం సొంతం చేసుకున్నానని నిత్యశ్రీ అన్నారు.

అధ్యాపకురాలు సదాలక్ష్మికి ఘన సన్మానం

న్యాల్‌కల్, సెప్టెంబర్ 09, (జనంసాక్షి):
సెప్టెంబర్ 5, జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా.. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అధ్యాపకురాలుగా పురస్కారాన్ని అందుకున్న అధ్యాపకురాలు సదాలక్ష్మికి కళాశాలకు చెందిన అధ్యాపక సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు, యువకులు ఘనంగా స్వాగతం, పలికి సత్కరించారు. మండలంలోని హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకురాలుగా విధులు నిర్వహిస్తున్న సదాలక్ష్మి రాష్ట్రస్థాయిలో ఉత్తమ అధ్యాపకురాలుగా ఎంపికై.. ముఖ్యమంత్రి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, ఇబ్రహీంపూర్ సర్పంచ్ అశోక్ పాటిల్, మహేష్, నర్సింలు, అశోక్, కళాశాల సిబ్బంది, పలువురు యువకులు, విద్యార్థినులు స్వాగతం పలికి సత్కరించారు.

భవిత సెంటర్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

అడ్డాకుల సెప్టెంబర్ 9 (జనంసాక్షి):
అడ్డాకుల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన భవిత సెంటర్‌ను, అలాగే పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనులను అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ బుధవారం పరిశీలించారు.
ఈ సందర్భంగా భవిత సెంటర్‌లోని వసతులను పరిశీలించిన ఆయన, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనులను పరిశీలించారు.
నిర్మాణ పనులు నెమ్మదిగా సాగుతున్నట్లు గుర్తించిన అదనపు కలెక్టర్ పనులను వేగవంతం చేసి, నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ రవి, సంబంధిత ఏఈని ఆదేశించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయురాలు జ్యోతి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, ఏఈ వెంకటేష్ తదితరులు ఉ

వరి పంటపై పొలం బడి రైతుల కార్యక్రమాల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలి

• జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు

ఖిల్లా ఘనపురం, సెప్టెంబర్ 9, (నంసాక్షి):
మండల పరిధిలోని అంతయిపల్లి గ్రామ పంచాయతీ భవనం దగ్గర బుధవారం వ్యవసాయ శాఖ, ఆత్మ (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) ఆధ్వర్యంలో వరి పంటపై పొలం బడి (ఫార్మ్ స్కూల్) కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సమగ్ర భూ యాజమాన్యం, సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర చీడపీడల యాజమాన్యంపై రైతులకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ,,,
సమగ్ర భూ యాజమాన్యంలో భాగంగా పొలంలో అధికంగా రసాయన ఎరువులు వినియోగించకుండా పచ్చిరొట్ట ఎరువులను ఉపయోగించాలని రైతులకు సూచించారు. నేలలో ఉన్న పోషకాలను గుర్తించి, పంటకు అవసరమైన పోషకాలను మాత్రమే

అందించడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవాలని తెలిపారు.
సమగ్ర పోషక యాజమాన్యంలో భాగంగా అధికంగా భాస్వరం ఎరువులు వినియోగించడం వల్ల నేలలో పోషకాల లభ్యత తగ్గే అవకాశం ఉందని వివరించారు. దీనికి ప్రత్యామ్నాయంగా పీఎస్‌బీ (ఫాస్ఫరస్ సొల్యూబిలైజింగ్ బ్యాక్టీరియా)ను ఉపయోగించాలని, అధిక యూరియా వినియోగానికి బదులుగా అవసరమైన మేరకు నానో యూరియాను వినియోగించాలని సూచించారు. పంట అవసరానికి అనుగుణంగానే ఎరువులు వాడాలని రైతులకు సూచించారు.పంటను ఆశించే పురుగులను గుర్తించి,

వాటికి అనుగుణమైన పురుగుమందులను మాత్రమే వినియోగించాలని సూచించారు. పురుగుల ఉధృతిని గుర్తించేందుకు పంట కాలంలో లింగాకర్షక బుట్టలు, విషపు ఎరలను ఉపయోగించాలని, పురుగుల తీవ్రతను బట్టి మాత్రమే మందులు వాడాలని తెలిపారు. అలాగే ఇతర పంటలకు సంబంధించిన రైతుల సందేహాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజనేయులు, టీకేవీకే వనపర్తి నుంచి డాక్టర్ నవత, జిల్లా డీపీడీ హైమావతి, ఏఓ, మల్లయ్య ఏఈఓ, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల గళంపై ప్రభుత్వం ఉక్కుపాదం

• ఇళ్ల వద్దే ముందస్తు అరెస్టులు

మిడ్జిల్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం, కనీస వేతనాల పెంపు కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని పోలీసులు ముందస్తు అరెస్టులతో అడ్డుకున్నారు. బుధవారం తెల్లవారుజామునే అంగన్‌వాడీ సంఘాల నాయకులు, కార్యకర్తలను ఇళ్ల వద్దే గృహనిర్బంధం చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుజాగ్రత్తగా అరెస్టులు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని అంగన్‌వాడీలు, ఉద్యోగ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలీచాలని

వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసన చేయడం ప్రజాస్వామ్య హక్కన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్న ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

చేర్యాల, సెప్టెంబర్ 09 (జనంసాక్షి):
స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం చేర్యాలలో నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. మండల అధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు గౌడ్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.15 వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో 40 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు

పడుతున్నారని ఆరోపించారు. పేద విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, లేకపోతే పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నర్ర మహేందర్ రెడ్డి, అంకుగారి శశిధర్ రెడ్డి, కాశెట్టి పాండు, ముచ్చేంతుల సిద్ధారెడ్డి, మన్నే సత్యవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సభాపతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీల సభ్యత్వం రద్దు చేయాలి

ఎర్రవల్లి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): తెలంగాణ శాసనసభాపతి గద్దం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, నవీన్‌రెడ్డి చేసినట్లు ఆరోపిస్తున్న అనుచిత వ్యాఖ్యలను జోగులాంబ గద్వాల జిల్లా డీసీసీ సెక్రటరీ మధు నాయుడు ఖండించారు. రాజ్యాంగబద్ధమైన పదవిని కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనన్నారు. దళిత వర్గానికి చెందిన వ్యక్తి స్పీకర్‌గా ఉండటాన్ని అవమానించే వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. రాజకీయ విభేదాలు సహజమే అయినా రాజ్యాంగ పదవుల గౌరవాన్ని దెబ్బతీయడం సరికాదన్నారు. బాధ్యులైన ఎమ్మెల్సీలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారి సభ్యత్వాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని, శాసనసభను డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్లక్ష్యం.. పట్టించుకోని ప్రభుత్వం

• సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ డిమాండ్

నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):
నారాయణపేట ప్రభుత్వ ఆస్పత్రి, మెడికల్ కాలేజీలో నిర్లక్ష్యం కొనసాగుతోందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సతీష్ ఆరోపించారు. ఆస్పత్రి సమస్యలపై జిల్లా వైద్యాధికారికి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయడంతో పాటు ప్రైవేట్ ఆస్పత్రుల్లో అధిక వసూళ్లను అరికట్టాలని కోరారు.

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, నర్సింగ్, ఇతర సిబ్బంది కొరతతో పాటు మందులు, వైద్య పరికరాలు, ల్యాబ్, మౌలిక వసతుల కొరత ఉందన్నారు. దీంతో పేదలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని తెలిపారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు స్కానింగ్, రక్త పరీక్షలు, డయాగ్నస్టిక్ టెస్టులు, మందులు, చికిత్స పేరుతో అధిక మొత్తాలు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు జరిగితే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
ఎంఎల్‌టీ, పారామెడికల్ విద్యార్థుల క్లినికల్ శిక్షణకు జీఓఎంఎస్ నం.258 ప్రకారం రూ.వెయ్యి ఫీజుకు బదులుగా రూ.4 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారని సతీష్ తెలిపారు. దీనిపై విచారణ జరిపి నిబంధనల ప్రకారం ఫీజు వసూలు చేయాలని కోరారు. ప్రజలు, విద్యార్థులకు న్యాయం చేయకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

వినాయక ఉత్సవాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- **డీజేలకు అనుమతి లేదు.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**
- **కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పారితోష్ పంకజ్**

సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): ఈ నెల 14న నిర్వహించనున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. కలెక్టరేట్‌లో ఉత్సవాల భద్రతా ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

నిమజ్జన ప్రాంతాల్లో బారికేడ్లు, స్విమ్మర్లు, లైట్లు, తాగునీరు, అవసరమైన చోట్ల క్రేన్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిమజ్జన మార్గాల్లో రోడ్డు మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ పోర్టల్‌లో ముందస్తు సమాచారం నమోదు చేసి, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ తెలిపారు. ప్రతి మండపం వద్ద నీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

అధిక శబ్దంతో కూడిన లౌడ్‌స్పీకర్లు, డీజేలకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. మైకులు, స్పీకర్లను ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే నిర్వాహకులు, డీజే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, అత్యవసర పరిస్థితుల్లో డయల్-112కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.

రంగంపేటలో ఉచిత వైద్య శిబిరం

- **పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయం**
- **డిసిఎంఎస్ వైస్ చైర్మన్ అరిగే రమేష్ కుమార్ ఆధ్వర్యంలో**

కొల్చారం, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): కొల్చారం మండలంలోని రంగంపేట గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన సింధు హాస్పిటల్ వైద్య బృందం ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించింది. రమేష్ కుమార్ రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా వైద్యులు గుండె సంబంధిత వ్యాధులు, గైనకాలజీ, షుగర్, బీపీ, రక్త పరీక్షలు, గర్భిణీ స్త్రీలకు అవసరమైన వైద్య పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్‌తో పాటు జనరల్ మెడిసిన్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు.

గ్రామీణ ప్రాంత ప్రజలకు నిపుణులైన వైద్యుల ద్వారా ఉచితంగా వైద్య పరీక్షలు అందించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని వైద్యులు సూచించారు.

గౌతపూర్‌లో
'అరైవ్ అలైవ్' అవగాహన

బాలానగర్, సెప్టెంబర్ 09 (జనంసాక్షి): రోడ్డు ప్రమాదాల నివారణకు మహబూబ్‌నగర్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా గౌతపూర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బాలానగర్ ఎస్ఐ నరేందర్‌రెడ్డి గ్రామస్తులు, యువతకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. అతివేగం, మొబైల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ తాళ్ల ప్రకాష్‌గౌడ్ కార్యక్రమాన్ని అభినందించారు. ఉప సర్పంచ్ పెద్దోని యాదయ్య, వార్డు సభ్యులు, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ముట్టడికి
ముందే అంగన్‌వాడీల అరెస్టులు

వనపర్తి రూరల్, సెప్టెంబర్ 09, (జనంసాక్షి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అసెంబ్లీ ఎదుట నిరసన చేపట్టేందుకు సిద్ధమైన అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసినట్లు వారు తెలిపారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా పలువురు అంగన్‌వాడీ టీచర్లు, బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఓ అంగన్‌వాడీ టీచర్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీలకు రూ.18 వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. దాదాపు 30 ఏళ్లుగా సేవలందిస్తున్న తమపై పనిభారం పెంచుతూ వేతనాలు పెంచకుండా నిర్బంధాలు చేయడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెంచిన వేతనాలే ప్రస్తుతం కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని వేతనాలు పెంచాలని, అంగన్‌వాడీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఎల్‌నినో ప్రభావంతో పెరిగిన విద్యుత్ వాడకం

- **కెపాసిటర్ బ్యాంకులతో లోవోల్టేజీ సమస్యకు పరిష్కారం**

నారాయణపేట, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): నారాయణపేట జిల్లాలో గత రెండు వారాలుగా వ్యవసాయ విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. వర్షాలు తగ్గిపోవడంతో పాటు ఎల్‌నినో ప్రభావంతో ఎండల తీవ్రత పెరగడం, భూగర్భ జలాలు అడుగంటడంతో రైతులు వ్యవసాయ మోటార్లపై ఎక్కువగా ఆధార పడుతున్నారు.

జిల్లాలో సాగునీటి కాలువలు పరిమితంగా ఉండటంతో విద్యుత్ మోటార్లే పంటలకు ప్రధాన ఆధారంగా మారాయి. దీంతో మక్తల్, ధన్వాడ, మాగనూరు సెక్షన్ల పరిధిలోని ఉప విద్యుత్ కేంద్రాల్లో లోవోల్టేజీ సమస్య ఏర్పడింది.

సమస్యను పరిష్కరించేందుకు డీఈ రాజు నాయక్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లాలోని వివిధ ఉప విద్యుత్ కేంద్రాలను పరిశీలించి 12 ఫీడర్లలో లోవోల్టేజీ సమస్యను గుర్తించారు. ఆయా కేంద్రాల్లో ఇప్పటివరకు 12 లైన్ కెపాసిటర్ బ్యాంకులను ఏర్పాటు చేశారు. దీంతో ఒక్కో ఫీడర్‌పై సుమారు 30 యాంప్స్ వరకు లోడ్ తగ్గి, రైతులకు సాధ్యమైనంత నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అవకాశం ఏర్పడిందని తెలిపారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఉప విద్యుత్ కేంద్రంలోనూ కెపాసిటర్ బ్యాంకుల సామర్థ్యాన్ని పెంచినట్లు చెప్పారు. మక్తల్ పట్టణంలో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఒక్కో ఫీడర్‌పై సుమారు 30 యాంప్స్ విద్యుత్ లోడ్ పెరిగిందని డీఈ తెలిపారు. భూగర్భ జలాలు తగ్గిపోవడంతో నీటిని అందుబాటులోకి తెచ్చుకునేందుకు రైతులు 5 హెచ్‌పీ మోటార్లకు బదులుగా 7.5 హెచ్‌పీ మోటార్లను వినియోగిస్తున్నారని, దీనివల్ల విద్యుత్ డిమాండ్ మరింత పెరిగిందన్నారు.

సాగునీటి వనరులు విస్తరించే వరకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి, విద్యుత్ వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఐఎస్ఐ మార్క్ కలిగిన మోటార్లను ఉపయోగించాలని, తద్వారా మోటార్లు కాలిపోకుండా ఆర్థిక నష్టం నివారించవచ్చని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడుతున్న పరిస్థితులను ఎదుర్కొని వ్యవసాయ రంగాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు రైతుల సహకారం అవసరమని డీఈ రాజు నాయక్ విజ్ఞప్తి చేశారు.

రైతు విజ్ఞాన కేంద్రానికి భూమిపూజ

నారాయణపేట జిల్లా బ్యూరో సెప్టెంబర్9 (జనంసాక్షి): నారాయణపేట మండలం లింగం పల్లి గ్రామ శివారులో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ప్రియాంక, ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, గ్రామ సర్పంచి భాగ్యతో కలిసి బుధవారం భూమి పూజ నిర్వహించారు.రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాంకేతిక పరి జ్ఞానం, ఉద్యాన పంటల సాగు, అధిక దిగుబడులు సాధించే విధానాలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ఉపయోగప డుతుం దని అధికారులు తెలిపా రు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివ రెడ్డి, జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కుంభం శివ కుమార్ రెడ్డి, యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డా.ఎం. యాకాద్రి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొనంగేరి హనుమంతు, మార్కెట్ కమిటీ సభ్యులు, మండలానికి చెందిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

నాగలిగిద్ద మండల
జర్నలిస్ట్ ఫోరం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

నాగలిగిద్ద, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): నాగలిగిద్ద మండల జర్నలిస్ట్ ఫోరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడిగా నాగశెట్టి, అధ్యక్షుడిగా పుండ్లేక్, ఉపాధ్యక్షుడిగా బాలాజీ, ప్రధాన కార్యదర్శిగా భీంసింగ్ రాథోడ్, కార్యదర్శిగా మోహన్, కోశాధికారిగా సిద్రాం పాటిల్, సహాయ కార్యదర్శిగా గౌతం సిద్ధూ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా దత్తు సాయి, ప్రశాంత్, లక్ష్మణ్ ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని, మండలంలోని ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు.

దళిత స్పీకర్ తల్లిని
అవమానించడం హేయమైన చర్య

- **మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసు ప్రవర్తన తగదు**

అమరచింత, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కులం పేరుతో దూషించిన ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షుడు ఎస్.అజయ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అజ్జపాగు ప్రశాంత్‌కుమార్, కేవీపీఎస్ నాయకులు మాట్లాడుతూ దళితుడు స్పీకర్ పదవిలో ఉండటాన్ని జీర్ణించుకోలేకనే అవమానకర వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. కేవలం అసెంబ్లీ సమావేశాల వరకు సస్పెన్షన్ కాకుండా ఎమ్మెల్సీల సభ్యత్వాలను పూర్తిగా రద్దు చేయాలని కోరారు. అసెంబ్లీలో వ్యక్తిగత దూషణలకు బదులు ప్రజా సమస్యలు, అభివృద్ధిపై చర్చించాలని సూచించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల జరిగిన దురుసు ప్రవర్తనపై విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సభ్యత్వాల రద్దు వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఆర్.ఎన్. నాగరాజు, ధైవేలు తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమా పథకం - 2026-27 పోర్టల్ ప్రారంభం

• రైతు మరణాల నమోదుకు ఆదేశం

రేవల్లి, సెప్టెంబర్ 09 (జనంసాక్షి): రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా పథకానికి సంబంధించి 2026-27 పాలసీ సంవత్సరంలో మరణించిన అర్హత కలిగిన రైతుల వివరాలను రైతు భరోసా – రైతు బీమా పోర్టల్ లో నమోదు చేసుకోవాలని రేవల్లి మండల వ్యవసాయ అధికారి మణిచందర్ తెలిపారు.

ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, 14.08.2026 తేదీన లేదా ఆ తర్వాత సంభవించిన రైతుల మరణాలను పోర్టల్ లో నమోదు చేయాలని క్షేత్రస్థాయి వ్యవసాయ అధికారులకు సూచించారు.

అర్హత నిబంధనలు: 1). సంబంధిత రైతుకు 2025-26 పాలసీ సంవత్సరానికి చెల్లుబాటు అయ్యే ఎల్ఐసి ఐడి ఉండాలి. 2),రైతు 2026-27 పాలసీ సంవత్సరానికి బీమా కవరేజీకి అర్హుడై ఉండాలి. 3), రైతు వయస్సు 18 నుండి 59 సంవత్సరాల మధ్య ఉండాలి. 4), 2026-27 పాలసీ సంవత్సరానికి అర్హత కలిగిన రైతుల జన్మతేదీ 14.08.1967 నుండి 14.08.2008 మధ్య ఉండాలి. 5),అర్హత కలిగిన రైతుల మరణ వివరాలను క్షేత్రస్థాయి అధికారులు సకాలంలో, ఖచ్చితంగా పోర్టల్ లో నమోదు చేయాలి.

6), రైతు మరణానికి సంబంధించిన వివరాలను నమోదు చేసే ముందు పై అర్హత నిబంధనలను తప్పనిసరిగా పరిశీలించి నిర్ధారించాలని రేవల్లి మండల వ్యవసాయ అధికారి మన చందర్ తెలిపారు.

కేసీఆర్ ఇంటిపై దాడికి నిరసన

• బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

తెలకపల్లి, సెప్టెంబర్ 8 (జనంసాక్షి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఇంటిపై జరిగిన దాడిని ఖండిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ముట్టడికి వెళ్లకుండా మండలంలోని బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కేందుకు ముందస్తు అరెస్టులు చేయడం సరికాదన్నారు. కేసీఆర్ ఇంటిపై దాడికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు సత్యం, మాజీ ఎంపీటీసీ రమేష్, సీనియర్ నాయకులు పెట్రోల్ రాములు, బక్కయ్య, జనార్ధన్, పులి కాశన్న, వెంకటేష్, జంగం సత్యం, లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

సాదాసీదాగా సాగిన సర్వసభ్య సమావేశం...

• మహిళా సర్పంచుల స్థానంలో భర్తలు హాజరు

మల్దకల్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. మండల ప్రత్యేక అధికారి జగ్గునాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంపీడీవో ఆంజనేయరెడ్డి, తహసీల్దార్ ఝాన్సీరాణి హాజరయ్యారు. వివిధ గ్రామాల సమస్యలను సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉలిగేపల్లి, నేతువానిపల్లి తదితర గ్రామాల మహిళా సర్పంచుల స్థానంలో వారి భర్తలు సమావేశానికి హాజరై సమస్యలను వివరించడం చర్చనీయాంశంగా మారింది.

గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, పాఠశాలలు, మౌలిక వసతుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు కోరారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అర్హులకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాండా సర్పంచ్ నార్య నాయక్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని సభ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. సమావేశానికి విద్యుత్, ఉపాధిహామీ, తాగునీరు, విద్య, హౌసింగ్, వైద్య శాఖల అధికారులు, ఎంఈఓ సురేష్, ఏపీవో సుజాత, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, సర్పంచులు, కార్యదర్శులు తదితరులు హాజరయ్యారు.

నవాబుపేటలో ఘనంగా శాంతి కమిటీ సమావేశం

• డీజేలు వాడితే కఠిన చర్యలు

నవాబుపేట, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): రాబోయే గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట పోలీసులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో పోలీసుల ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. పోలీసు అధికారులు, గణేష్ మండపాల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, మైనారిటీ వర్గాల పెద్దలు, వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గణేష్ మండపాల ఏర్పాటుకు పోలీసు, సంబంధిత శాఖల ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని పోలీసులు సూచించారు. మండపాల వద్ద సీసీటీవీలు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్, అగ్నిమాపక భద్రతా చర్యలు పాటించాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి డీజేలు వినియోగిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లౌడ్‌స్పీకర్లకు నిర్దేశించిన శబ్ద పరిమితులను పాటించాలని, ఊరేగింపుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలు పాటించాలని కోరారు.

ఇతర మతాల పట్ల గౌరవం చూపుతూ మత సామరస్యాన్ని కాపాడాలని సూచించారు. సోషల్ మీడియాలో పుకార్లు, వివాదాస్పద, రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిమజ్జనం సమయంలో క్రమశిక్షణతో వ్యవహరించాలని, యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండేలా నిర్వాహకులు బాధ్యత వహించాలని తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని నిర్వాహకులు, ప్రతినిధులు తెలిపారు.

కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్ల వేతనాలు పెంచాలి

అమరచింత జనం సాక్షి సెప్టెంబర్ 9 బుధవారం టియు సి ఐ యూనియన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11న చలో హైదరాబాద్ లో నాన్ టీచింగ్ వర్కర్ల జరగబోయే కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి కేజీబీవీ నాందేడ్ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వనపర్తి జిల్లా అమరచింత మండలం కేజీబీవీ హాస్టల్లో కరపత్రాల విడుదల చేయడం జరిగింది . ఈ సందర్భంగా టి.యు.సి.ఐ. జిల్లా ఉపాధ్యక్షులు సిరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 495 కేజీబీవీలు కొనసాగుతున్నాయి అన్నారు ఇందులో 43 కేజీలు ఇంటర్ వరకు పొడిగించబడ్డాయి దేశవ్యాప్తంగా కేవలం మహిళలచే ఉత్తమ ఫలితాలతో విజయవంతంగా జరప బడుతున్న కేజీబీవీలు మాత్రమే కేజీబీవీ లో పనిచేస్తున్న వంట మనుషులు స్కా వెంజర్లు స్లీపర్లు వాచ్మెన్లు అటెండర్లు జాబ్ చాట్ కంటే ఆధారంగా పనిచేస్తున్నారు. వీరికి వీక్లీ ఆఫ్ వారానికి ఒక రోజు సెలవు కూడా మెజార్టీ గా కేజీబీవీలో అమలు కావడం లేదు కనీస విశ్రాంతి లేక తరచూ అనారోగ్యాలకు గురవుతున్నారు మానసిక ఒత్తిడికి గురై విధులకు రాజీనామా చేస్తున్నారు.ఆ భారం మిగతా సిబ్బందిపై పడుతున్నది ఇప్పటికైనా వర్కర్ల అందరికీ వీక్లీ ఆఫ్ సక్రమంగా అమలు చేయాలని వెంటనే చర్యలు తీసుకోవాలని వారు అన్నారు. నైట్ డ్యూటీ రద్దు చేయాలి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీ అకౌంట్లో ఏఎన్ఎం లకు నెలకు 14,300 మిగతా సిబ్బందికి 7800 నుండి 9750 వరకు మాత్రమే వేతనాలు ఇస్తుంది తెలంగాణ గురుకులాల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ సిబ్బందికి 15600 నుండి 24 వేల రూపాయలు వరకు వేతనాలు వస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2006 లో వచ్చిన జీవో నెంబర్ 14 జీవో నెంబర్ 68 అమలు చేయకపోవడం వల్ల కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బందికి దీర్ఘకాలంగా నష్టపోతున్నారని రాష్ట్ర ప్రభుత్వ పిఆర్సి ఇచ్చిన నివేదిక ప్రకారం కనీస వేతనాలు అమలు కాలేదని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన కనీస వేతనాలు కూడా కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లకు అమలు కావడం లేదు. ప్రధాన డిమాండ్లు కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లకు కనీస వేతనం 26,000 ఇవ్వాలి తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనీస వేతనాలుఅమలు చేయాలి అకౌంటెంట్ వర్కర్లకు జాబ్ చాటుకు భిన్నంగా ఇటీవల కేటాయించిన నైట్ డ్యూటీ లను వెంటనే రద్దు చేయాలి. వర్కర్లు అందరికీ వీక్లీ ఆఫ్ వారం ఒక రోజు సెలవు తప్పకుండా అమలు చేయాలి.ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి. పిఎఫ్ ఈఎస్ఐ అమలు చేయాలి .ఉద్యోగ ఆరోగ్య భద్రత కల్పించాలి. 05 రిటైర్మెంట్ వయసు 65 ఏళ్లకు పెంచాలి. రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలి. ఈ కార్యక్రమంలో టి.యు.సి.ఐ జిల్లా ఉపాధ్యక్షులు సి.రాజు. అనురాధ.పల్లవి. శోభ.చంద్రకళ.జ్యోతి.పద్మ. స్వర్ణ.ప్రవళిక. బాలమ్మ. పుష్ప.గౌతమి.రాధ. తదితరులు పాల్గొన్నారు.

దళిత స్పీకర్‌ను అవమానిస్తే ఊరుకునేది లేదు

ఎమ్మెల్సీ తాతా మధుపై క్రిమినల్ కేసులు పెట్టాలి

ఉర్కొండ, సెప్టెంబర్ 09 (జనంసాక్షి): తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు ఆరోపిస్తున్న అనుచిత వ్యాఖ్యలను ఉర్కొండ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎం.డి. అయ్యూబ్ పాషా తీవ్రంగా ఖండించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌ను కులం పేరుతో దూషించడం హేయమైన చర్య అన్నారు. ఎమ్మెల్సీ తాతా మధుపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని కోరుతూ ఉర్కొండ ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కూడా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నత రాజ్యాంగ పదవిలో ఉన్న దళిత స్పీకర్‌కే అవమానం జరిగితే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పోలీసులు వెంటనే చర్యలు తీసుకోకపోతే మండలవ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పి.శ్రీనివాసులు, ఎం.మహేష్, ఆర్.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

సేవాలను సమర్ధవంతంగా అందించాలి

పాపన్నపేట, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) : పశుసంపద అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను పశు పోషకులకు చేరేలా అధికారులు,సిబ్బంది కలిసి పనిచేయాలని జిల్లా పశు వైద్య,సంవర్ధక శాఖాధికారి ఆదిత్య వర్మ పేర్కొన్నారు. బుధవారం పాపన్నపేట పశువైద్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అ శాఖ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి విధులు తీరుపై తగు సూచనలు చేశారు. పశువైద్య సేవలను సమర్ధవంతంగా అందించడం,టీకాల కార్యక్రమం పటిష్టంగా అమలు పరచడం,పశువైద్య శిబిరాల నిర్వహణ,కృత్రిమ గర్భాధారణ కార్యక్రమాల ఆన్ లైన్ పురోగతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. పశు వైద్యాధికారులు సౌమ్యరెడ్డి,ప్రవీణ్ కుమార్,జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సతీష్ కుమార్ తదితరులు ఉన్నారు.

వేరుశనగ సాగుపై రైతులకు అవగాహన

ఉప్పునుంతల, సెప్టెంబర్ 10 (జనంసాక్షి): ఉప్పునుంతల రైతులకు వేరుశనగ సాగుపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 10న వ్యవసాయ శాస్త్రవేత్తలు హాజరవుతారని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మద్దు నరేందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు పీఏసీఎస్-రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయంలో పాలెం వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు మెరుగైన సాగు పద్ధతులు, అధిక దిగుబడి, నాణ్యమైన విత్తనాల ఎంపిక, పంట సమస్యలు, నివారణ చర్యలపై సూచనలు అందించ నున్నారు. రైతులు తమ సందేహాలను నేరుగా శాస్త్రవేత్తలను అడిగి నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. గ్రామ రైతులందరూ కార్యక్రమానికి హాజరై శాస్త్రవేత్తల సూచనలు సద్వినియోగం చేసుకోవాలని నరేందర్‌రెడ్డి కోరారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలపై పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు

వనపర్తి రూరల్, సెప్టెంబర్ 09 (జనంసాక్షి): మాజీ సీఎం, ప్రతిపక్ష నేత కేసీఆర్ మరణాన్ని కోరుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యే కే.శంకరయ్య చేసినట్లు ప్రచారంలోకి వచ్చిన వ్యాఖ్యలను ఖండిస్తూ బీఆర్ఎస్ నాయకులు వనపర్తి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి ఆధ్వర్యంలో నాయకులు ఎస్‌హెచ్‌ఓకు ఫిర్యాదు అందజేశారు. సెప్టెంబర్ 8న ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు మీడియా, సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమయ్యాయని తెలిపారు. ప్రజాప్రతినిధి రాజకీయ నాయకుడి మరణాన్ని కోరుతూ వ్యాఖ్యలు చేయడం అభ్యంతరకరమని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉందని ఆరోపించారు. కేసీఆర్ భద్రతకు ముప్పు కలిగించే వ్యాఖ్యలపై విచారణ జరిపి ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విజయకుమార్, మిద్దెల కరుణాకర్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గొంతుకగా
నిలిచిన కాళోజీ నారాయణరావు: ఎస్పీ వినీత్

నారాయణపేట జిల్లా బ్యూరో సెప్టెంబర్ 9(జనంసాక్షి): తెలుగు సాహిత్యానికి ప్రజాకవి కాళోజీ నారాయ ణరావు చేసిన సేవలు చిర స్మరణీయమని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. కాళోజీ జయంతి వేడుకల సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన కాళోజీ చిత్రపటానికి ఎస్పీ డాక్టర్ వినీత్ పూలమాల వేసి ఘనంగా నివాళు ల ర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ
తెలంగాణ భాషా పరిరక్ష ణకు కాళోజీ విశేషంగా కృషి చేయడంతో పాటు, తన కవితలు, రచనల ద్వారా ప్రజల్లో ఉద్యమ చైతన్యాన్ని నింపిన మహ నీయుడు కాళోజీ నారాయ ణరావు అని కొనియాడా రు. తెలుగు సాహితీ రంగా నికి ప్రజాకవి కాళోజీ చేసిన సేవలు మరువలేనివని, తెలంగాణ ప్రాంతంలోని కవులు, రచయితలకు ఆయన ఒక దార్శనికుడిగా, స్ఫూర్తిదాతగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజల జీవన విధానం, వారి కష్టాలు, ఆకాంక్షలు, సామాజిక పరిస్థితులను తన రచనల ద్వారా ప్రతిబింబించిన గొప్ప ప్రజాకవి అని కొని యాడారు. ఆయన సాహి త్యం ప్రజల్లో చైతన్యాన్ని నింపడమే కాకుండా, సమాజంలోని అన్యాయా లు, అసమానతలు, అణచివేతలపై ప్రశ్నించే ధైర్యాన్ని కల్పించిందని అన్నారు. భారతదేశ అత్యున్నత పౌర పుర స్కారమైన పద్మవిభూషణ్తో సత్కరించబడిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఆశయాలు, స్ఫూర్తిని ప్రజలు కొనసాగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ మహే ష్, ఆర్ ఐ విజయభాస్కర్, ఆఫీస్ సూపర్డెంట్ శ్యామ్ సుందర్ రాజు,ఆర్ ఎస్సై లు లు శివ శంకర్, శ్వేత, శివయ్య, పోలీసు సిబంది తది తరులు పాల్గొన్నారు.

మదనాపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

- **గణేష్ నిమజ్జనానికి పటిష్ట భద్రతా చర్యలు**

వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): ప్రజల్లో పోలీస్ శాఖపై మరింత నమ్మకం కలిగేలా ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునితరెడ్డి సూచించారు. గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
బుధవారం మదనాపూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ రిసెప్షన్ సెంటర్, ఫిర్యాదుల స్వీకరణ, బాధితులతో సిబ్బంది వ్యవహరించే తీరు, కేసుల నమోదు, పరిష్కార విధానం, స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, సమస్యాత్మక వ్యక్తుల వివరాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని పరిశీలించారు. అనంతరం మదనాపూర్ మండలంలోని సరళసాగర్, రామన్‌పాడ్, కొత్తపల్లి బ్రిడ్జి నిమజ్జన ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని, అన్ని శాఖల సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.
శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, రాత్రింబవళ్లు పెట్రోలింగ్, నిఘా కొనసాగించాలని ఎస్పీ ఆదేశిం చారు. ఆకతాయితనం, ఈవ్‌టీజింగ్, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, గంజాయి విక్రయాలు, చోరీలు, ర్యాష్ డ్రైవింగ్, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, వదంతులు, రెచ్చగొట్టే పోస్టులు ప్రచారం చేసే వారిపై సైబర్ చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గణేష్ మండపాల నుంచి నిమజ్జన ప్రదేశాల వరకు నిరంతర నిఘా, ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని సూచించారు.
కార్యక్రమంలో డీఎస్పీ గిరిబాబు, సీఐలు శివకుమార్, ఓడి రమేష్, సుగంధరత్నం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, ఎస్ఐ జగదీశ్వర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సేవే లక్ష్యం..
సమస్యల పరిష్కారమే ధ్యేయం
సొంత నిధులతో రెండు బస్సు షెల్టర్లకు భూమిపూజ

ఉర్కొండ, సెప్టెంబర్ 09 (జనంసాక్షి): మండల కేంద్రంలోని కోదాడ-జడ్చర్ల 167 జాతీయ రహదారిపై రెండు బస్సు షెల్టర్ల నిర్మాణానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి బుధవారం సొంత నిధులతో భూమిపూజ చేశారు. ప్రయాణికులకు ఎండ, వాన నుంచి రక్షణ కల్పించేందుకు షెల్టర్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సేవే తన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల శ్రీనివాసులు, బీజేపీ నాయకులు లక్ష్మయ్య, లక్ష్మణ్‌కుమార్‌గౌడ్, కొమ్ము శ్రీను, సందీప్‌కుమార్, రామకృష్ణ, శ్రీశైలం, సురేష్ తదితరులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై
పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు

పెబ్బేరు, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసినట్లు ఆరోపిస్తున్న అనుచిత వ్యాఖ్యలను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ చనిపోతే రాష్ట్రానికి పట్టిన శని పోతుందంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం అభ్యంతరకరమని పేర్కొన్నారు. తెలంగాణ సాధనలో కేసీఆర్ పాత్రను గుర్తుచేస్తూ ప్రజాప్రతినిధి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమన్నారు. నిరసనగా బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ వెంకటేష్‌గౌడ్‌కు ఫిర్యాదు చేసి, ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని, వ్యక్తిగత దూషణలు, మరణాన్ని కోరుకునే వ్యాఖ్యలు ప్రజాస్వామ్యంలో సమర్థనీయం కాదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దిలీప్‌రెడ్డి, వనం రాములు, కౌన్సిలర్లు, మన్నెం తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు జీవన నైపుణ్యాలు ఎంతో అవసరం

- **200 మంది విద్యార్థులకు ఏబీసీ 3.0 అవగాహన**
- **నన్ను నేను తెలుసుకోవడం.. వ్యక్తిత్వ వికాసం.. బాధ్యతాయుత ప్రవర్తనపై ప్రత్యేక శిక్షణ**
- **జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి**

మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):
చదువుతో పాటు విద్యార్థులకు జీవన నైపుణ్యాలు ఎంతో అవసరమని, తద్వారా వారు తమ జీవితంలో ఎదురయ్యే సమస్యలను సమర్థవంతం గా ఎదుర్కొని సరైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి అన్నారు. బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏబీసీ 3.0 అవగాహన కార్యక్రమాన్ని మెదక్ పట్టణంలోని గవర్నమెంట్ బాయ్స్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హేమ భార్గవి మాట్లాడుతూ నన్ను నేను తెలుసుకోవడం,వ్యక్తిత్వం, వ్యక్తిత్వ వికాసం, బాధ్యతాయుత ప్రవర్తన, సరైన నిర్ణయాలు తీసుకోవడం, తమ బలాలు-బలహీనతలను గుర్తించడం తదితర అంశాలపై అవగాహన కల్పించామన్నారు. ఇతరుల ప్రభావానికి లోనుకాకుండా స్వతంత్రంగా ఆలోచించి మంచి నిర్ణయాలు తీసుకునేలా విద్యార్థులను చైతన్యపరిచామన్నారు. పిల్లల రక్షణ కోసం అందుబాటులో ఉన్న చైల్డ్ హెల్ప్‌లైన్ 1098పై విద్యార్థులకు వివరించారు. బాలలకు ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా సంబంధిత సహాయ వ్యవస్థలను ఆశ్రయించాలని సూచించారు విద్యార్థులకు విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించడం ఎంతో ముఖ్య మన్నారు. చిన్న వయస్సు నుంచే సరైన ఆలోచనా విధానం, బాధ్యతాయుత ప్రవర్తన అలవర్చుకుంటే భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగగలరని పేర్కొన్నారు.లైఫ్ స్కిల్స్ ట్రైనర్, ఏబీసీ 3.0 ప్రాజెక్ట్ డైరెక్టర్ సునీత రాకేష్ కొర్రపాటి మాట్లాడుతూ, విద్యార్థుల్లో కేవలం సమాచారాన్ని పెంచడం మాత్రమే కాకుండా, వారి ఆలోచనా విధానంలో సానుకూల మార్పు తీసుకురావడమే ఏబీసీ 3.0 కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు తమను తాము అర్థం చేసుకుని, తమ సామర్థ్యాలను గుర్తించి, జీవితంలో ఎదురయ్యే పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనేలా జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.అవగాహనతో ఆలోచన మారాలి.. ఆలోచనతో ప్రవర్తన మారాలి.. ప్రవర్తనతో భవిష్యత్తు మారాలి" అనే లక్ష్యంతో ఏబీసీ 3.0 కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన, సురక్షితమైన, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పెంపొందించే దిశగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మల్లేశం ఉపాధ్యాయులు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

వీరన్నపేటలో
కోతుల బెడదకు తక్షణ పరిష్కారం చూపాలి
రైతుల పంటలను కాపాడాలని గ్రామస్తుల విజ్ఞప్తి

చేర్యాల, సెప్టెంబర్ 09 (జనంసాక్షి): మండలంలోని వీరన్నపేట గ్రామంలో కోతుల బెడద రోజురోజుకూ తీవ్రంగా మారుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి రేషన్ కార్డుదారుడి నుంచి రూ.500 చొప్పున వసూలు చేసి కోతులను పట్టించే కార్యక్రమం చేపట్టినప్పటికీ, ఇప్పటివరకు ఎన్ని కోతులను పట్టారు, ఎక్కడికి తరలించారు, ఎంత మొత్తం వసూలు చేసి, ఎంత ఖర్చు చేశారనే వివరాలు ప్రజలకు తెలియజేయలేదని పేర్కొన్నారు.

ప్రస్తుతం వరి పొట్ట దశకు చేరుకోవడంతో కోతులు పొలాల్లోకి వచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు తెలిపారు. నెలల తరబడి శ్రమించి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో నష్టం జరుగుతుండటంతో తీవ్ర ఆందోళన చెందుతున్నామని అన్నారు. గ్రామపంచాయతీ సకాలంలో స్పందించకపోవడం వల్ల సమస్య మరింత తీవ్రమవుతోందని ఆరోపించారు.

గతంలో కోతులను పట్టిన బృందాన్ని తిరిగి రప్పించి బెడదను పూర్తిస్థాయిలో అరికట్టాలని కోరారు. అలాగే గతంలో వసూలు చేసిన రూ.500కు సంబంధించిన పూర్తి వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి రైతుల పంటలను కాపాడేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరారు.

విద్యా రంగంలో మెదక్‌ను ఆదర్శంగా నిలపాలి
- ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి

మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): 2026-27 విద్యా సంవత్సరంలో మెదక్ జిల్లాను విద్యా రంగంలో ఆదర్శంగా నిలపాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో అమలవుతున్న ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా నైపుణ్యాల కార్యక్రమాల పురోగతిపై జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాధికారులు, సెంట్రల్ స్పేర్ ఫౌండేషన్ ప్రతినిధులతో ఆమె సమీక్ష నిర్వహించారు.

విద్యార్థుల అభ్యాస స్థాయిలు, లోపాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. విద్యార్థుల్లో చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు నాణ్యమైన బోధన అందించాలని కలెక్టర్ సూచించారు.

ప్రతి విద్యార్థి అభ్యాస పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, వారి స్థాయికి అనుగుణంగా లక్ష్యబద్ధమైన కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. అవసరమైన విద్యార్థులకు పునరభ్యాస బోధన అందించడం తో పాటు నిరంతర మూల్యాంకనాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. మార్గదర్శక ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా పాఠశాలలను సందర్శించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా నైపుణ్యాల సామర్థ్య పాఠశాలల కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. రానున్న రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి వార్షిక అంచనాల్లో మెదక్ జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపడం లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ నిర్దేశించారు.

ఈ లక్ష్య సాధనకు జిల్లా విద్యాశాఖ, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల బృందాలు సమన్వయంతో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. జిల్లాలో విద్యా ప్రమాణాలను మరింత పెంచి, మెదక్‌ను విద్యా రంగంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు.

కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, సహాయ మండల అధికారి సుదర్శన్ మూర్తి, మండల సమన్వయ అధికారి రాజు, సహాయ పాఠశాల అధికారి నవీన్ కుమార్, జిల్లా పర్యవేక్షణ అధికారి రాజిరెడ్డి, సహాయ ప్రధాన విద్యా సమన్వయ అధికారి కరుణాకర్, ఆర్థిక, లెక్కల అధికారి శ్రీనివాస్ రెడ్డితో పాటు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కాళోజి నారాయణ రావు జయంతి వేడుకలు

కోహెడ, సెప్టెంబర్ 09 (జనం సాక్షి): మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మన తెలంగాణ భాషను, యాసలోని మాధుర్యాన్ని తన రచనలతో ఎలుగెత్తి చాటిన ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలకు ఏఎంసి చైర్ పర్సన్ ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ మహనీయుడికి నివాళులు అర్పించారు. ఆయన గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్ కుమార్, ఎం పి డి ఓ కిష్టయ్య, వైస్ చైర్మన్ భీమ్ రెడ్డి తిరుపతి రెడ్డి, సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షులు కరివేద చంద్రా రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, మండలములోని వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి, అక్టోబర్ 9 (జనంసాక్షి): తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి పాఠశాలలో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. తెలంగాణ భాషను, సంస్కృతిని, సాహిత్య సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి సాంబయ్య గారు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో తెలుగు భాషపై ఆసక్తి, సృజనాత్మకత, వేదికపై మాట్లాడే నైపుణ్యాలు పెంపొందుతాయని పేర్కొన్నారు.

జహీరాబాద్, సెప్టెంబర్ 9(జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దూరు, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): మద్దూర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) దోరేపల్లిలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భీమ్లా నాయక్, చేతిరాత శిక్షకులు ఎజాజ్ అహ్మద్, డా. ఆవుటి మల్లేష్, ఉపాధ్యాయులు రజిత, సంధ్యారాణి, నరేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చేతిరాతలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కాళోజీ చిత్రపటాలను బహుకరించారు. విద్యార్థుల ఉత్సాహం, ఉపాధ్యాయుల సమన్వయంతో పాఠశాల ప్రాంగణం కళకళలాడింది.

కేటీదొడ్డి, సెప్టెంబర్ 09(జనంసాక్షి): ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను కేటీదొడ్డి తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కరుణాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది మరియు పలువురు అధికారులు పాల్గొని కాళోజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. డీటీ శివశంకర్ సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ ఆర్ఐ లు అశోక్ నాగేష్ జిపిఓ పంచాజన్య ఆంజనేయులు భీమయ్య వెంకటేష్ నాయుడు తదితరులు వున్నారు.

జడ్చర్ల, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): తెలంగాణ ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు బుధవారం జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయం, పురపాలక సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కాళోజీ గొప్పతనాన్ని, వారి సేవలను సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ లక్ష్మన్న, రెవెన్యూ ఆఫీసర్ సలాం, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నాగేష్, వివిధ శాఖల అధికారులు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

మల్దకల్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని బుధవారం తెలంగాణ భాషా దినోత్సవం కార్యక్రమాన్ని అమరవాయిజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విష్ణు, అక్షితుడు,సుమలత, అనిత,ధనుంజయ, సరిత, ఆనంద్, అరుణ, ఈరన్న,విద్యార్థులు పాల్గొన్నారు.

జడ్చర్ల, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): జడ్చర్ల మండలం ఆలూరు జెడ్పీహెచ్ ఎస్‌లో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపె లింగయ్య, హెచ్ఎం అహ్మద్ షరీఫ్, ఘజల్ కవి ఇరివింటి వెంకటేశ్వర శర్మ, ఉప సర్పంచ్ మల్లేష్ యాదవ్, వార్డు సభ్యులు రాజశేఖర్, ఆంజనేయులు, అబ్దుల్ అలీమ్, ఉపాధ్యాయులు హరి హరనాథ్, సోమ్ల సంధ్య, హైమావతి, మంజుల, విజయ ప్రతాప్, నిర్మల, కడమంచి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 9(జనం సాక్షి); అన్యాయాన్ని ఎదిరించే ప్రతిధ్వనిగా, హక్కుల కోసం పోరాడే ప్రజా మనిషిగా పేరుగాంచిన కాళోజి నారాయణరావు జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో మంజుల,జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి అక్బర్ పాషా, పలువురు జిల్లా అధికారులు,ఇతర సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): పెబ్బేరు మోడల్ స్కూల్లో కాళోజి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. కాళోజి చిత్రపటానికి పూలమాలవేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు సుమిత్ర, అంజనీ దేవి మరియు అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీరంగాపూర్ సెప్టెంబర్ 9 (జనంసాక్షి): శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రజాకవి పద్మ విభూషణ్ కాళోజి నారాయణ గారి 111వ జయంతి వేడుకలు తెలంగాణ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు బి జయంత్ రెడ్డి, ఎల్లస్వామి,నిర్వహించగా ఉపాధ్యాయ బృందము విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.